భక్తిశ్రద్ధలతో 'కృష్ణాష్టమి'

ఆలయాలకు పోటెత్తిన భక్తులు





నెల్లూరు : ఫత్తేఖాన్‌పేటలో ఉట్టి కొడుతున్న యువకుడు

ఇస్కాన్ మందిరంలో జగన్నాథుడి అలంకారం

ఇస్కాన్‌లో కృష్ణుడి వేషధారణలో చిన్నారి

జయ జనార్దనా..!

తలపై కిరీటం, దానిపై నెమలి ఈక, మెడలో హారాలు, చేతిలో పిల్లనగ్రోవి, తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టుతో పాలబుగ్గల చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తుల కోలాటం ఆకట్టుకోగా, ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా సాగింది. 'హే కృష్ణా ముకుందా మురారీ.. జై కృష్ణ.. జై జై కృష్ణా' నామస్మరణలతో జగన్నాథుడి మందిరాలు హోరెత్తిపోయాయి. తొలుత ఆలయాల్లో ఉదయం స్వామివారికి అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు, విశేష పూజలు, సాయంత్రం పల్లకీ సేవలు జరిగాయి. నెల్లూరులోని ఇస్కాన్ మందిరానికి భక్తజనం పోటెత్తారు. వేణుగోపాలుడి ఆలయంలో దేవేరులతో కలిసి స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుల కల్యాణం కనులపండువగా జరిగింది. రాత్రి శేషవాహనం కొలువుదీరిన ఉత్సవర్లు భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు.

- నెల్లూరు (సాంస్కృతికం)







నెల్లూరు : వేణుగోపాలుడికి, దేవేరులకు ఊంజల్‌సేవ

రాపూరు : పెద్ద శేష వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

ఇసుక దోపిడీ నిజమే!

- రూ.వందల కోట్ల ఖనిజాన్ని మింగిన ఘనులు
- పెన్నా గర్భంలో విచ్చలవిడిగా తవ్వకాలు
- మైనింగ్ అధికారుల విచారణలో బట్టబయలు
- 18 ప్రాంతాల్లో పూర్తయిన విచారణ
- శాటిలైట్ ఇమేజ్‌తో పోల్చేందుకు ఆదేశాలు

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగింది నిజమేనని మైనింగ్ అధికారుల విచారణలో తేటతెల్లమైంది. పెన్నా నదీ గర్భంలో ఎక్కడపడితే అక్కడ.. ఎలా పడితే అలా.. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపారని నిర్ధారణ అయ్యింది. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అనధికారికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమ ఇసుక వ్యాపారం విలువ రూ.వందల కోట్లలో ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు మైనింగ్ అధికారులు నివేదికలు తయారు చేశారు. మరోవైపు ఇసుక తవ్వకాలకు అనుమతులపై ఏసీబీ అధికారులు మైనింగ్ శాఖ కార్యాలయంలో విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు.



ఇందుకూరుపేట మండలం పల్లిపాడు వద్ద పెన్నా నదిలో అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

నెల్లూరు, అగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పెన్నా నదితో పాటు మన్నేరు వాగులో 18 చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణకు ఉత్తర్వులు ఇచ్చింది. కోవూరు నియోజకవర్గంలోని వేగూరులో 137 ఎకరాలు, ముదివర్తి-1లో 46.4 ఎకరాలు, ముదివర్తి-2లో 44.4, ముదివర్తి-3లో 8.77, ముదివర్తి-4లో 21.22, పల్లిపాడులో 22, పల్లిపాడు-2లో 4.22, లేగుంటపాడులో 7.41, కోడూరుపాడులో 7.66, వెంకటేశ్వపురంలో 4.72, మినగల్లులో 45.45, గొల్లకందుకూరులో 41.5, విరువూరులో 55.8, సూరాయపాలెంలో 63, నెల్లూరులో 4.36, కందుకూరు నియోజకవర్గంలోని మనేటి కోటలో 4.51, రాళ్లపాడులో 5.75, కలవాళ్లలో 0.78 ఎకరాల్లో అక్రమంగా తవ్వకాలు జరిగినట్లు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఆదేశాలతో జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్ నేతృత్వంలో మైనింగ్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. దాదాపు నెల రోజుల పాటు ఈ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో పరిశీలన జరిపారు. గుంతలను కొలతలు తీశారు. ఆ తర్వాత ఏ ప్రాంతంలో ఏ మేరకు తవ్వకాలు జరిగాయి..? అన్న లెక్కలు వేశారు. ప్రతిచోటా భారీగానే ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

● త్వరలోనే కేసులు..?

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల అక్రమ తవ్వకాలు జరిపినందుకు జేపీ, ప్రతిమ సంస్థలపై ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఇప్పుడు అదే క్రమంలో జిల్లాలోనూ కేసుల నమోదుకు సిద్ధమవుతోంది. అయితే అధికారులు ఇచ్చిన నివేదికను మరింత బలపరిచేందుకు శాటిలైట్ ఇమేజస్‌తో (ఫొటోలు) కూడా విచారణ చేయాలని తాజాగా ఆదేశాలిచ్చింది. ఈ ఇమేజస్ ద్వారా ఎప్పుడు ఏ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరిపారన్నది తెలిసిపోతుంది. కాగా అక్రమ తవ్వకాలు నిజమని తేలడంతో తాజాగా రికార్డుల పరిశీలనకు ప్రభుత్వం ఏసీబీకి ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలోనే గడిచిన మూడు రోజులుగా ఏసీబీ అధికారులు నెల్లూరులోని మైనింగ్ శాఖ కార్యాలయంలో గత ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలకు ఇచ్చిన అనుమతులకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియంతా పూర్తయి ఆధారాలన్నీ పక్కాగా సిద్ధమయ్యాక అక్రమార్కులపై సీరియస్ యాక్షన్‌కు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ విచారణపై మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలతో 18 ప్రాంతాల్లో విచారణ పూర్తి చేసినట్లు చెప్పారు. అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపినట్లు నిర్ధారణ అయ్యిందని, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. తాజాగా శాటిలైట్ ఇమేజస్‌తో విచారణ జరపాలని ఆదేశాలు వచ్చినట్లు వెల్లడించారు.

'మైనింగ్'లో ఏసీబీ సోదాలు

● మూడు రోజులుగా ప్రతి ఫైలూ తనిఖీ

నెల్లూరు (క్రైం) : మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల బృందం మూడు రోజులుగా విస్తృత సోదాలు చేస్తోంది. ఏసీబీ డీఎస్పీ శిరీష ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రతి ఫైల్‌నూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ప్రభుత్వంలో అమల్లోకి వచ్చిన ఇసుక పాలసీలో కేటాయించిన రీచ్‌లు, తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు, పాయింట్ల వద్ద ఇసుక రవాణా ఇలా ప్రతి అంశానికి సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కేటాయించిన అనుమతులు, తవ్వకాలలో నిబంధనలు ఉల్లంఘించడం, అనుమతులు లేని మైనింగ్ ప్రాంతాలకు సంబంధించిన అన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగానే జిల్లాలోనూ ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తుంది.



వన మహోత్సవానికి

సర్వం సన్నద్ధం

- 30న విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం
- నెల్లూరు నగరవనంలో ప్రారంభ సభ
- 20 రకాల మొక్కలను సిద్ధం చేసిన అటవీ శాఖ
- డిసెంబరులోగా 30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 26 : రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన వన మహోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. నెల్లూరు శివార్లలోని కొత్తూరు సమీపంలో ఉన్న నగరవనంలో వన మహోత్సవం ప్రారంభ కార్యక్రమం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నాడు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల సమక్షంలో వన మహోత్సవం జరపనున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేందుకు కదిలి రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతోపాటు డిసెంబరులోగా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటేందుకు అటవీ శాఖ కార్యాచరణ రూపొందించింది.



'వన మహోత్సవం' కోసం అటవీ శాఖ సిద్ధం చేసిన మొక్కలు

● జిల్లా టార్గెట్ 30 లక్షలు

అటవీ శాఖలోని టెరిటోరియల్, సోషల్‌ఫారెస్ట్ తోపాటు హార్టికల్చర్, సెరీ కల్చర్, డ్వామా, విద్యాశాఖ ఇలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఈ వన మహోత్సవంలో భాగం కానున్నారు. అయితే ఏ శాఖ వారు ఎన్ని మొక్కలు నాటాలన్న దానిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మొక్కలను అందజేయనున్నారు. ఇందుకు అవసరమైన మొక్కలను నర్సరీలు, వీఎస్ఎస్‌ల్లో సిద్ధం చేసి ఉంచారు. అదే విధంగా ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డు నకలును నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న సోషల్‌ఫారెస్ట్ కార్యాలయంలో అందజేసి మొక్కలను ఉచితంగా పొందవచ్చు.

● 20 రకాలు

వన మహోత్సవం కోసం దాదాపు 20 రకాల మొక్కలను ఇప్పటికే జిల్లా అటవీ శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ప్రధానంగా ఎర్రచందనం, టేకు, రావి, మర్రి, నారేపి, నెమలినార, తెల్లమద్ది, నేరేడు, వేప, చిండుగ, రోజ్‌ఉడ్, ఉసిరి, జామ, కరివేపాకు, దానిమ్మ, బొప్పాయి, మునగ తదితర మొక్కలను సిద్ధం చేసి ఉంచారు.

ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలి



వన మహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. అప్పుడే పెట్టుకొన్న టార్గెట్ పూర్తి చేయగలం. జిల్లావ్యాప్తంగా నర్సరీలు, వీఎస్ఎస్‌ల్లో దాదాపు 20 రకాల మొక్కలను సిద్ధం చేసి ఉంచాము. టెరిటోరియల్ విభాగంలో 4లక్షల మొక్కలతోపాటు పలు విభాగాల్లో 30 లక్షల మొక్కలను సిద్ధం చేస్తున్నాము. కార్తీక మాసం నుంచి డిసెంబరులోగా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టుకొన్నాము.

- ఏ. చంద్రశేఖర్, డీఎఫ్‌వో

- ప్రాభవం కోల్పోతున్న చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం
- లాంఫాంకు అప్పగించినా ప్రయోగం ఫెయిల్
- జంగిల్ క్లియరెన్స్‌కే రూ.కోట్ల వ్యయం

నాటి వైభవం.. నేడు ఏదీ?



నిరుపయోగంగా ఉన్న చినపవని వ్యవసాయ క్షేత్రం భూములు

రాష్ట్రంలోనే వరి విత్తనాభివృద్ధి క్షేత్రంగా ఓ వెలుగు వెలిగిన చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా మారింది. అధిక దిగుబడులనిచ్చే పలు నూతన వరి వంగడాల రూపకల్పనకు కేంద్రంగా నిలవడమేకాక ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వరిసాగు అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన చినపవని క్షేత్రం నేడు ప్రాభవం కోల్పోయింది. 1994లో పోటెత్తిన వరదకు రాళ్లపాడు రిజర్వాయరు తెగిపోవటంతో ఈ క్షేత్రానికి గ్రహణం పట్టింది. తదనంతరం అనేక రూపాంతరాలు చెందినా రైతులకు ఉపయోగపడే పరిస్థితి లేకుండా పోయింది. ఇక్కడ పరిశోధనల పేరుతో రూ. కోట్లు ఆవిరైపోతున్నా ఒక్క నూతన వంగడాన్ని కూడా అభివృద్ధి చేసింది లేదు.

కందుకూరు, ఆగస్టు 26 : రాళ్లపాడు రిజర్వాయరు 1994లో తెగిపోయిన తర్వాత ఇక్కడ వరిసాగుకు అవకాశం లేకుండా పోవటంతో ఈ క్షేత్రంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో పదేళ్లపాటు ఈ క్షేత్రం బీడుగా మారింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే మహీధరరెడ్డి ఈ క్షేత్రాన్ని పునరుద్ధరించాలన్న లక్ష్యంతో రూ.కోట్లు మంజూరు చేయించి చేసిన ప్రయత్నం విఫలమైంది. తగినంతమంది అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది నియామకం జరగక పోవటంతో రెండు, మూడేళ్లకు ఒకసారి రూ. లక్షలు వెచ్చించి జంగిల్ క్లియరెన్స్ జరుగుతూనే ఉంది. తూతూమంత్రంగా వరిసాగు చేసి వదిలేయటం పరిపాటిగా మారింది. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా వరిసాగుకు తగినంత నీటిసరఫరా కాని పరిస్థితిలో 2017లో ఎమ్మెల్యే పోతుల రామారావు ఈ క్షేత్రాన్ని పప్పుదినుసులు, తృణధాన్యాల అభివృద్ధి కేంద్రంగా మార్పు చేయించి లాంఫాంకు అప్పగించేలా కృషి చేశారు. లాంఫాం చేతిలో ఇన్ని వందల ఎకరాల సారవంతమైన భూములను పెడితే పరిస్థితి షరా మామూలే అన్న చందంగా మారింది. చినపవని క్షేత్రానికి ఉన్న 543 ఎకరాల్లో 413 ఎకరాలను లాంఫాంకు అప్పగించారు. కేపీఎస్ఎం రోడ్డుకు తూర్పున ఉన్న మరో 130 ఎకరాలను అలాగే ఉంచారు. 2019లో ఈ భూములను లాం ఫాంకు అప్పగించినా వారు కూడా రెండు సార్లు జంగిల్ క్లియరెన్స్ చేశారే తప్ప ఇంతవరకు ప్రయోగాలు చేసింది లేదు. వాస్తవానికి లాంఫాం ఆధ్వర్యంలో పప్పుధాన్యాలు, నూనెగింజలతోపాటు కొర్రలు, అరికెలు, సాములు తదితర తృణ ధాన్యాలలో అధిక దిగుబడుల దిశగా, నూతన వంగడాల రూపకల్పన దిశగా ప్రయోగాలు జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఆయా పంటల సాగులో వినూత్న పద్ధతులు, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించటం, నూతన వంగడాలను రైతులకు పరిచయం చేయటం లాంటి పనులను లాంఫాం బాధ్యతాయుతంగా నిర్వహిస్తుందని ఆశించారు. అయితే లాంఫాం ఇక్కడ ఒక శాస్త్రవేత్తను, ఓ రికార్డు అసిస్టెంట్‌ను, ఒక ఏఈవోను శాశ్వత ప్రాతిపదికన నియమించి, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు అటెండర్లను కాంట్రాక్టు బేసిస్‌లో నియమించింది. వారు మొక్కుబడిగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నది.

కేవీకేతో సమన్వయం చేసుకోవాలి

కందుకూరులో ప్రస్తుతం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శాస్త్రవేత్తలు తగినంతమంది ఉన్నారు. వారు రైతులకు అందుబాటులో ఉంటూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే సీటీఆర్ఐలో వారికి కేటాయించిన ఎర్రనేలల్లో అన్నిరకాల పంటల సాగుకు, పరిశోధనలకు అవకాశం లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో చినపవని వద్ద ఉన్న సారవంతమైన భూముల్లో లాంఫాం శాస్త్రవేత్తలతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు కూడా సమన్వయంతో పరిశోధనలు సాగించేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఎక్సైజ్‌లోకి సెబ్!

- విలీనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు
- అతి త్వరలో ఉత్తర్వులు?
- మద్యం పాలసీపై పలు రాష్ట్రాల్లో అధ్యయనం
- ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోనూ కొత్త పాలసీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 26 : ఎన్నో అవినీతి ఆరోపణలను మూట గట్టుకున్న సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అతి కొద్దిరోజుల్లోనే కనుమరుగు కానుంది. కూటమి ప్రభుత్వ ఎక్సైజ్‌శాఖలో విలీనం చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌ను రెండు విభాగాలుగా విడగొట్టి 70 శాతం సిబ్బందిని సెబ్‌కు కేటాయించారు. అలాగే పోలీసుశాఖ నుంచి 30 శాతం సిబ్బందిని కలుపుకొని పూర్తిస్థాయిలో సెబ్‌ను 2020లో గత వైసీపీ సర్కారు ఏర్పాటు చేసింది. మద్యం అక్రమ రవాణాతోపాటు గంజాయి, ఎర్ర చందనం, ఇసుక, మట్టి, గుట్కా, పేకాట ఇలా అన్నింటిపై సెబ్ తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టవచ్చని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, విధించిన లక్ష్యాలను మాత్రం సెబ్ అధికారులు అందుకోలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టాక నూతన మద్యం పాలసీ వైపు వేగంగా అడుగులు వేసింది. ఈ క్రమంలో సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేయాలా!? వద్దా!? అన్న అంశంపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళ నాడు, కేరళ రాష్ట్రాలకు కమిటీలను పంపి అక్కడి మద్యం పాలసీ విధానాలు, లోటుపాట్లను అధ్యయనం చేయాలని సూచించింది. దీంతో 19 మంది కమిటీ సభ్యులు ఆయా రాష్ట్రాల్లో మద్యం పాలసీలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందచేశారు. దీంతో సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 28వ తేదీన పూర్తిస్థాయిలో ఉత్తర్వులు విడుదల కానున్నట్లు సమాచారం.



● ఎన్నెన్నో ఆరోపణలు

2020లో సెబ్ ఏర్పడినప్పటి నుంచి అనేక ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. సెబ్‌కు ఎస్పీ బాస్‌గా ఉండగా, అదనపు ఎస్పీ స్థాయి అధికారిని జేడీగా నియమించారు. జిల్లావ్యాప్తంగా 10 సెబ్ స్టేషన్లు ఉండగా, జేడీ ప్రత్యేక బృందం తనిఖీల్లో పాల్గొనేవారు. ఎక్కువగా జేడీ బృందం మాత్రమే తనిఖీలు ముమ్మరం చేసి మద్యం, గంజాయి, ఇసుక, గుట్కా, పేకాట వంటి స్థావరాలపై దాడులు నిర్వహించి, బాధ్యులను అరెస్టు చేసేవారు. మరి ఆయా ప్రాంతాల్లో ఉన్న సెబ్ స్టేషన్లలోని అధికారులు ఎందుకు విధులు నిర్వహించడం లేదన్న ప్రశ్నలు అనేకం వ్యక్తమయ్యాయి. సెబ్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పూర్తిగా అవినీతికి అలవాటు పడిపోయారని, ఇసుక, మట్టి మాఫియా, గుట్కా కేంద్రాలు, గంజాయి విక్రయదారుల నుంచి మామూళ్లు వసూలు చేసేవారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. స్థానిక నాయకులతోనూ మిలాఖత్ అయి సెబ్ లక్ష్యానికి తూట్లు పొడిచారన్న విమర్శలనూ మూటగట్టుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు మద్యం డంప్‌లు చేస్తున్నారని సెబ్‌కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు దీంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంతో వారు దాడులు చేశారని నాయకులు ఆరోపించారు. ఇలా చెప్పుకుంటూపోతే సెబ్‌పైన వచ్చినన్ని ఆరోపణలు ఏ శాఖపైనా రాలేదు.

పాతనేరస్థుడి దారుణ హత్య

- సన్నిహితులే కత్తులతో నరికి చంపేశారు
- భయంతో పరుగులు తీసిన ప్రజలు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 26: కత్తిపట్టుకున్న వారు ఆ కత్తితోనే మరణిస్తారన్న సామెతను ఎప్పటి నుంచో వింటూనే ఉన్నాం. అలానే ఓ పాత నేరస్థుడును మద్యం మత్తులో నెలకొన్న వివాదంతో అప్పటి వరకు అతనితో మద్యం సేవించిన సన్నిహితులే కత్తులతో దాడి చేసి అతి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని రామలింగాపురం రైల్వే బ్రిడ్జీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జనశక్తి నగర్‌కు చెందిన గుంజి రవి అలియాస్ కత్తి రవి పాత నేరస్థుడు. ఈ ఏడాది జ్యోతినగర్‌కు చెందిన వెంకటేష్ అలియాస్ వెంకీ, మరో వ్యక్తితో కలిసి ఆటోనగర్‌లో దశరథ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనలో వేదాయపాలెం పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జూలైలో జైలు నుంచి బయటకు వచ్చిన రవి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా నెల్లూరు అనగుంటలోని తన స్నేహితుడు ప్రసాద్ ఇంట్లో వివాహ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు వేరే వ్యక్తి ఇవాల్సి డబ్బులు తీసుకువస్తానని భార్యకు చెప్పి ఈ నెల 25వ తేదీన రవి నెల్లూరుకు వచ్చాడు. శుభ కార్యంలో పాల్గొన్న అనంతరం రవి ఆదివారం రాత్రి తన పాత మిత్రులైన రౌడీ షీటర్లు సాయితేజ అలియాస్ కమ్మ సాయి, వెంకటేష్, మరి కొందరితో కలిసి మద్యం సేవిస్తుండగా అనగుంటకు చెందిన ఆటోడ్రైవర్ రవితేజ వారితో కలిశాడు. దీంతో అందరూ కలిసి జనశక్తి నగర్‌కు వెళ్లి మళ్లీ మద్యం సేవించారు. ఇదే సమయంలో రౌడీషీటర్ సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ మద్యం సేవిస్తున్న వారిలో ఓ వ్యక్తికి ఫోన్ చేసి ఆటో డ్రైవర్ రవితేజాను నానాదుర్భాషలాడాడు. ఈ విషయం గమనించిన రవి ఆ ఫోన్ తీసుకుని చింటూతో వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో ముత్తుకూరు బస్టాండు వద్ద ఉన్నానని, వచ్చి ఏం చేస్తావో చేయి అంటూ చింటూ చెప్పడంతో అక్కడే ఉండమని చెప్పిన రవి ఆటోలో రవితేజా వద్దని వారిస్తున్నా వినకుండా అతనితో కలిసి ముత్తుకూరు బస్టాండుకు చేరుకున్నారు. చింటూకు ఫోన్ చేసినా తీయకపోవడంతో గంటపాటు ఎదురుచూసి బయలుదేరి రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జీ వద్దకు చేరుకునే సరికి ఇంతలో చింటూ ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడగడంతో అండర్ బ్రిడ్జీ పక్కనే ఉన్న టీ కొట్టు వద్ద ఉన్నానని రవి చెప్పాడు. బైక్‌పై అక్కడి చేరుకున్న చింటూ, మరో వ్యక్తి రవితో గొడవకు దిగారు. ఇంతలో వీఆర్‌సీ వైపు నుంచి కమ్మసాయి, వెంకటేష్‌లు బైక్‌లో వచ్చిన అక్కడికి చేరుకున్నారు. కమ్మసాయి తన వెంట తెచ్చుకున్న కత్తితో రవిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ క్రమంలో నలుగురు కలిసి అతనిని కత్తులతో నరికి హత్య చేసి పరారుకాగా ఆటో డ్రైవర్ రవితేజ సైతం అక్కడ నుంచి పరారయ్యాడు. సోమవారం తెల్లవారుజామున హత్య జరగడంతో అక్కడే టీ తాగుతున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమీపంలోని సీసీఫుటేజ్‌ల ఆధారంగా హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఆటోడ్రైవర్ రవితేజ ద్వారా వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.



గుంజి రవి మృతదేహం, రవి (ఫైల్)

తల్లి మృతిని జీర్ణించుకోలేక కుమార్తె ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 26: తల్లి మృతిని జీర్ణించుకోలేని కుమార్తె ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగంలోని నవాబుపేట పరుచూరివారి వీధికి చెందిన పరిమళ(38), చలపతిలు దంపతులు. వారికి గాయత్రి అనే కుమార్తె ఉంది. మరిమళకు చిన్నతనంలోనే వివాహం కావడంతో కుమార్తె జన్మించిన కొద్ది రోజుల్లోనే భర్త చలపతి మృతి చెందాడు. అప్పటి నుంచి కుమార్తె గాయత్రితో కలసి తన తల్లి జయమ్మ వద్దనే ఉంటుంది. కుమార్తె గాయత్రి పెద్దదయ్యాక వివాహం చేసి అత్తారింటికి కాపురానికి పంపింది. ఈ క్రమంలో తన తల్లి జయమ్మ మృతి చెందడంతో ఒంటరి తనంతో మనస్థాపానికి గురై పరిమళ ఆదివారం రాత్రి తన ఇంట్లోని దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు సంగంలో ఉంటున్న ఆమె కుమార్తె గాయత్రికి సమాచారం ఇవ్వగా ఆమె నెల్లూరుకు చేరుకుని తల్లి మృతిపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపుకాచి యువకుడిపై దాడి


దాడిలో గాయపడ్డ లోకేష్‌నాయుడు

జలదంకి, ఆగస్టు 26: మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దివి లోకేష్ నాయుడు(34)పై అదే గ్రామానికి చెందిన తోటకూర సురేష్, మల్లి ఆదివారం అర్ధరాత్రి కాపుకాచి దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు, లోకేష్‌నాయుడు కేశవరం గ్రామానికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిమ్మసముద్రంకు వస్తున్నాడు. ఈ క్రమంలో పాతకక్షల నేపథ్యంలో కాపుకాచి మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో లోకేష్‌నాయుడు తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన లోకేష్‌ను రోడ్డుపై అటుగా వెళ్తున్న వారు చూసి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తోటకూర సురేష్, దివిలోకేష్‌ల మధ్య స్థలవివాదమై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ సంఘటనపై ఎస్‌ఐ లతీఫున్నీసా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడి : ఒకరికి తీవ్రగాయాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 26: మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి మతిస్థిమితం లేని ఓ వ్యక్తి, మరో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం మేరకు, గ్రామానికి చెందిన పులివర్తి నాగేశ్వరరావుకి మతిస్థిమితం లేదు. తరుచూ గ్రామంలో పలువురితో గొడవలకు దిగేవాడు. సోమవారం ఉదయం నుంచి గ్రామంలో హల్‌చల్ చేస్తూ అందర్నీ చంపేస్తానంటూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో రాత్రి వల్లెం విశ్వనాథ్‌రెడ్డి తన ఇంటి ఆరుబయట మంచంపై పడుకొని సెల్‌ఫోన్ చూస్తుండగా, నాగేశ్వరరావు అతనిపై ఒక్కసారిగా రోకలిబండతో దాడి చేశాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలై కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకొన్నవారు 108 వాహనంలో విశ్వనాథ్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరిశీలించారు. మతిస్థిమితం లేని వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు గ్రామానికి వెళ్లిన పోలీసులకు సైతం అతను ముచ్చెమటలు పట్టించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


ఉదయగిరి వైద్యశాలలో క్షతగాత్రుడ్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

సైదాపురం, ఆగస్టు 26: మండలంలోని తూర్పుపూండ్లకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... ఆదివారం అర్ధరాత్రి పాత కక్షలతో జడపల్లి శీనయ్యపై శిముడు వెంకటేశ్వర్లు (48) కత్తితో దాడిచేశాడు. అనంతరం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీంతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కాంతికుమార్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6925
వెండి కిలో ధర	రూ. 88,700
వెండి ఒక గ్రాము	రూ. 91.70

హార్డ్‌వేర్ దుకాణం యజమానిపై దాడి

కావలి రూరల్, ఆగస్టు26: పట్టణంలోని పెండెం సెంటర్‌లో ఉన్న రాందేవ్ హార్డ్‌వేర్ దుకాణం యజమాని ప్రకాష్‌పై సోమవారం కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు, ప్రకాష్ అన్న కుమారుడు గౌతమ్ తమిళనాడు రాష్ట్రం సేలంలోని ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అక్కడ దుకాణం యజమాని కుమార్తెను 10 రోజుల క్రితం తీసుకుని వచ్చాడని కారులో కొందరు వ్యక్తులు కావలికి వచ్చారు. రాందేవ్ హార్డ్‌వేర్ షాపు దగ్గరకు వచ్చి యజమాని ఎక్కడ అంటూ.. గౌతమ్ గురించి వాకబు చేశారు. ఈ క్రమంలో ప్రకాష్‌పై రాడ్లతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ జమాల్‌వలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువ ఇలా..

నీరు పారేదెలా!?

- ఉత్తరకాలువలో పాత స్ట్రక్చర్లు
- అధ్వానంగా చెరువులకు నీరు వదిలే తూములు
- మరమ్మతులను పట్టించుకోని వైసీపీ పాలకులు



ఉత్తర కాలువలో ఉన్న పాతస్ట్రక్చర్

రెండేళ్ల క్రితం ధ్వంసమైన చెరువు తూము

అనంతసాగరం, ఆగస్టు 26 : నాన్‌డెల్టా పరిధిలోని ఉత్తర కాలువ మనుగడ నేడు ప్రశ్నార్థంగా మారింది. కాలువలో అడుగడుగునా నెలకొన్న అడ్డంకులు పారుదలకు విఘాతం కలిగిస్తున్నాయి. సోమశిల జలాశయం నుంచి నీటి కేటాయింపుల్లో డెల్టా తరువాత నాన్‌డెల్టాకు ప్రాధాన్యత ఉంటుంది. ఉత్తర కాలువ పరిధిలో 44 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా మొదటి పంట సమయంలో రైతులు లబ్ధి పొందుతారు. రెండవ పంట సమయంలో కాలువలో అభివృద్ధి పనులపై యంత్రాంగం దృష్టి సారిస్తుంది. అయితే గత వైసీపీ హయాంలో ఉత్తర కాలువ మనుగడ గురించి అటు పాలకులు.. ఇటు అధికారులు దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.

● తొలగించని పాత స్ట్రక్చర్లు

750 క్యూసెక్కుల ఉన్న కాలువ సామర్థ్యాన్ని 1,550 క్యూసెక్కులుగా పెంచాలని వైసీపీ సర్కారు నిర్ణయించింది. అయితే, కాలువలో చేయాల్సిన అభివృద్ధి పనులను మాత్రం విస్మరించింది. ఇక కాలువలో పాత నిర్మాణాలు అలాగే వదిలేయడంతో నీటి పారుదలకు ఆటంకంగా మారుతున్నాయి. కెనాల్‌ను వెడల్పు చేసి కింద బెడ్‌తోపాటు కాలువ గట్లకు లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా ఆ దిశగా పనులు జరగలేదు. మరోవైపు ప్రధాన కాలువ నుంచి ఉప కాలువలకు నీరు సరఫరా చేసే ముఖద్వారాల వద్ద ఎత్తుపల్లాలు ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. వాటిని సరిచేసి ఉప కాలువల వద్ద పరిస్థితి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరినా ఫలితం లేదు. సోమశిల ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు అందించే క్రమంలో నిర్దేశించిన చెరువులకు పారుదల జరుగుతుంది. నీటి సరఫరా చేసే తూముల అధ్వానంగా ఉన్నాయి. కాలువ పరిధిలోని 11వ కి.మీ అనంతసాగరం మండలంలోని పాతాశపల్లి చెరువుకు నీరు సరఫరా చేసే తూము వద్ద రెండేళ్ల క్రితం స్ట్రక్చర్ దెబ్బతిన్నా ఇంత వరకు మరమ్మతు పనులు చేయ లేదు. ఇదే తరహాలో మరికొన్ని చెరువుల తూముల చెక్కులు దెబ్బతిని ఉన్నాయి. ఆత్మకూరు పరిధిలో కొన్ని చోట్ల కాలువ గట్లు దెబ్బతిని ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే అంశాన్ని ఓ రైతు ఇటీవల సోమశిలకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు ప్రస్తావించారు కూడా.

● రాళ్లపాడుకు చేరేది కొంతే..

ఉత్తర కాలువను కందుకూరు నియోజకర్గంలోని రాళ్లపాడు రిజర్వాయర్ (106 కి.మీ.) వరకు విస్తరించారు. సోమశిల జలాలు తరలించి అక్కడ నీటి అవసరాలు తీర్చాలన్నది ప్రణాళిక. అయితే నామమాత్రంగా పనులు చేయడంతో రాళ్లపాడుకు సమృద్ధిగా నీరు అందని దైనస్థితి నెలకొంది.

వరుణదేవా కరుణించు !

- మెట్టరైతుకు కలిసిరాని ఖరీఫ్
- వెలవెలబోతున్న నీటివనరులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26: ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేర కురవక ఖరీఫ్ సీజన్ మెట్ట రైతులకు కలిసొచ్చేలా కనిపించడంలేదు. వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతాల్లో పరిస్థితి నిరాశజనకంగా కనిపిస్తోంది. వర్షాలు లేక జలాశయాలు, చెరువులు, నీటికుంటలు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. వరి పండే మాగాణి భూములు సైతం బీళ్లుగా మారాయి. దీనికితోడు పంటలకు పెట్టుబడి విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపడంలేదు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సుమారు 250 చెరువులు ఉండగా, వాటి కింద 40 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. అలాగే గండిపాళెం, మర్రివూట్ల, నక్కల గండి రిజర్వాయర్ల కింద 22 వేల ఎకరాల ఆయ కట్టు కలదు. నీరు లేక ఆయా చెరువులు వెలవెలబో తున్నాయి. జలాశయాల్లో నీటిమట్టం డెడ్‌స్టోరేజీలో ఉంది. దీంతో చెరువులు, జలాశయాల ఆయకట్టు భూములు కొన్ని ప్రాంతా ల్లో చిట్టడవిని తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్ల కింద రైతులు అరకొరగా వరి, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేశారు. వరుణుడు కరుణించి నీటి వనరులకు పుష్కలంగా నీరు చేరితే పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది.


చుక్కనీరు లేని వెంకట్రావుపల్లి చెరువు


గుడినరవలో బీడుగా మాగాణి భూములు

వయసుతో సంబంధం లేకుండా దూరవిద్య

- 2024-25లో పది, ఇంటర్‌లో చేరికలు

పొదలకూరు, ఆగస్టు 26 : చదువుకు దూరమైన వారు, బడి మధ్యలో మానేసిన వారు, పది, ఇంటర్మీడియట్‌లలో అనుత్తీర్ణులైనవారు, ఔత్సాహిక అభ్యాసకులు, వయోజనులెవరైనా మళ్లీ చదువుకునేందుకు ప్రభుత్వం సార్వత్రిక విద్య ద్వారా అవకాశాన్ని కల్పిస్తోంది. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024- 25 ఏడాదికిగాను పది, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశా లకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. గ్రామీణ యువత, బాలికలు, ఎస్సీ, ఎస్టీలు, ప్రత్యేక అవసరాలు గల వారికి విద్యనందించడమే ఓపెన్ స్కూల్ లక్ష్యం.

● విద్యార్హతలు ఇవే

పదికి : అభ్యర్థి ఏదైనా పాఠశాలలో చదివితే టీసీ గానీ, రికార్డ్‌షీట్ గాని ఇవ్వాలి. ఏ పాఠశాలలోనూ ప్రవేశం పొందకపోయినా, ఎటువంటి విద్యా ర్హత లేకపోయినా పదో తరగతి చదివే సామర్థ్యం ఉంటే ప్రవేశం పొం దవచ్చు. వయోపరిమితి 2024 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.

● ఇంటర్‌లో అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. వయోపరిమితి 2024 ఆగస్టు 31 నాటికి 15 ఏళ్లు నిండి వుండాలి.

గ్రూపులు : ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ.

● ప్రవేశ కాలపరిమితి

ఓపెన్ స్కూల్‌లో ఏ కోర్సులో అయినా రిజిస్ట్రేషన్ పొందిన నాటి నుంచి అయిదేళ్ల వరకు అడ్మిషన్ చెల్లుబాటు అవుతుంది. అభ్యర్థులు 30 తరగతు లకు హాజరవ్వాలి. సాధారణ పాఠశాల, కళాశాల ధ్రువపత్రాలతో దూర విద్య ఉత్తీర్ణత ధ్రువపత్రాలకు సమాన అవకాశాన్ని కల్పించారు.

● దరఖాస్తు చేసుకోవడం ఇలా..

పది, ఇంటర్ ప్రవేశాల కోసం హెచ్‌టీటీపీఎస్:ఆబ్లిక్ఏపీఓపెన్‌స్కూల్, ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సచివాలయాల్లోనూ దరఖాస్తు రసీదును ఎంచుకున్న ఓపెన్ స్కూల్ కేంద్రంలో ఇవ్వాలి. ధ్రువపత్రాల పరిశీలన చేయించి ప్రవేశం పొందాలి.

● ముఖ్యమైన తేదీలు ఇలా..

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం : 31.07.24

చివరి తేదీ : 27.08.24

రూ.200 ఆలస్య రుసుముతో గడువు : 4.09.24

ఇంటి ఆవరణలో మలమూత్రాలు వేయవద్దన్నందుకు దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

కావలి రూరల్, ఆగస్టు 26: తన ఇంటి ఆవరణలో మల మూత్రాలు వేయవద్దన్నందుకు దాడి చేశారని షేక్ అస్రఫ్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు, మద్దూరుపాడుకు చెందిన అస్రఫ్ పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద ఓ ఇంటిని కొనుగోలు చేసి మూడేళ్లుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో చుట్టు పక్కన ఇళ్లకు చెందిన మాల్యాద్రి, అతని తండ్రితోపాటు శ్రీను అనే వ్యక్తి అస్రఫ్ ఇంటి గోడలపై మూత్రవిసర్జన చేసేవారు. అంతేకాక మలమూత్రాలను కవర్లలో వేసి సోమవారం అస్రఫ్ ఇంటి ఆవరణలో వేయగా, ఇలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించడంతో అస్రఫ్‌పై ఆ ముగ్గురు కలిసి కర్రతో దాడి చేశారు. తీవ్రగాయాలు కావడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను చెల్లించకపోతే కఠిన చర్యలు

- సీజీఎస్టీ ఏపీ ఆడిట్ వింగ్ కమిషనర్ ఆనందకుమార్

నెల్లూరు (హరనాథపురం); ఆగస్టు 26 : పన్ను చెల్లించని, తప్పుడు లెక్కలు చూపే సంస్థలపై ఆడిట్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని సీజీఎస్‌టీ ఏపీ ఆడిట్ వింగ్ కమిషనర్ పి. ఆనందకుమార్ స్పష్టం చేశారు. సోమవారం నగరంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్ ఆడిట్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులంతా జీఎస్టీ విధానం ద్వారా కచ్చితమైన పన్నులు చెల్లిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పన్ను కట్టకపోయినా, తాత్సారం చేసినా ఆడిట్‌లో తెలిసిపోతుందని, పెనాల్టీలు వసూలు చేస్తామన్నారు. తప్పుడు లెక్కలతో పన్నులు తక్కువ చెల్లించినా, పన్నులు ఎగవేసినా ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. ప్రజలు కూడా దుకాణాల్లో కొన్న ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. వ్యాపారులు, ప్రజల నుంచి వసూలు చేస్తున్న ప్రతి రూపాయిని ప్రజలకే ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వాలు జీఎస్టీ పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ రాకముందు 70 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉంటే జీఎస్టీ వచ్చాక ఆ సంఖ్య 1.40 కోట్లకు చేరిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో జీఎస్టీ ఆడిట్ వింగ్ బలోపేతానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నటు తెలిపారు. అన్ని ఆడిట్ సర్కిల్ కార్యాలయాల్లో కమిషనర్ చాంబర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో అనంతపురం, కర్నూలులోనూ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది 532 సంస్థల్లో ఆడిటింగ్ పూర్తి చేయాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ ఉషాకిరణ్, సూరింటెండెంట్లు మల్లెల శ్రీనివాసరావు, ఎన్.జైనేంద్రకుమార్, ఎస్ మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడులో 28,516 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ

- 124 బుకింగ్ ఆర్డర్లు : మైనింగ్ శాఖ డీడీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలోని మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో సోమవారం 124 ఇసుక బుకింగ్ ఆర్డర్లు వచ్చినట్లు జిల్లా మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాస కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1,128 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయగా, 28,516 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. నిల్వ ఉన్న ఇసుక కేంద్రం నుంచి మాత్రమే బుకింగ్ చేసుకొని రశీదు ఉన్న వాహనాలను మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఇస్తామని తెలిపారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 0861-2943569కు సంప్రందించాలని పేర్కొన్నారు.

కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో కార్పొరేషన్ టీపీవో అరెస్ట్

నెల్లూరు (క్రైం) : నెల్లూరు నగర పాలక సంస్థలో కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో టీపీవో దేవేంద్రను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేశారంటూ ఇద్దరు టీపీవోలు, మేయర్ భర్త, ఆయన సహాయకుడు, మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసు విచారణ చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం టీపీవో ధర్మేంద్రను అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

నేటినుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు

నెల్లూరు (విద్య) : ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ-1) పరీక్షలు జరగనున్నాయి. అయితే ఈ ఏడాది నుంచి పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1గా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబరు 4వతేదీ వరకు జరిగే ఈ పరీక్షలను రోజుకు ఒకటి చొప్పున నిర్వహించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మంగళవారం నుంచి సెప్టెంబరు 2వతేదీ వరకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే సిద్ధం చేసి ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం (డీసీఈబీ) ద్వారా పాఠశాలలకు అందించనున్నారు.

సోమశిలలో 31.910 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 26: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి సోమవారం 15.010 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 30.846 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పామాయిల్ పరిశ్రమలో ప్రమాదంపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ప్రాణనష్టం జరగలేదన్న యాజమాన్యం

ముత్తుకూరు, ఆగస్టు 26 : పంటపాలెంలోని పామాయిల్ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంపై ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని త్రిబుల్ ఎఫ్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో యంత్ర సామగ్రి కాలిపోయి ఆస్తి నష్టం మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన స్థలంలో కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా కేసు నమోదు కాలేదని ఈ నెల 25వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తతో కలకలం రేగింది. వెంటనే త్రిబుల్ ఎఫ్ పరిశ్రమ ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్ని ప్రమాదంపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి సోమవారం తెలిపారు.

కృష్ణం వందే జగద్గురుమ్ !

● వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు ● కిక్కిరిసిన ఆలయాలు ● కోలాటాలు, ఉట్టి మహోత్సవాలు

జిల్లావ్యాప్తంగా ఉన్న కృష్ణమందిరాలు, వైష్ణవాలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు తల్లులు తమ చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణలు వేసి జన్మాష్టమిని జరుపుకున్నారు.


లింగసముద్రం : రాధాకృష్ణుల విగ్రహాలకు పూజ చేస్తున్న ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, తదితరులు


అల్లూరు : గీతాశ్రమంలో గోపూజ చేస్తున్న నిర్వాహకులు


కలిగిరి: కృష్ణుడి వేషధారణలో బాలుడు, ఉదయగిరి, వరికుంటపాడులో ప్రత్యేక అలంకరణలో గోవర్ధన గిరిధారి


వింజమూరు : కృష్ణుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

కావలిటౌన్, ఆగస్టు 26: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం కావలిలో వైభవంగా జరిగాయి. పాతూరు కృష్ణమందిరం, రైల్వేరోడ్డులోని గీతా మందిరం, వెంగళరావునగర్‌లోని కృష్ణమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతూరు కృష్ణమందిరంలో వ్యవస్థాపక ధర్మకర్త బొంతా శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో ఉదయం స్వామివారిని ప్రత్యేక పూలంగి సేవ, అభిషేకాలు, గోపూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు ఉట్టి కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కావలి రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న కృష్ణ మందిరాలు, రామాలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేసి స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

లింగసముద్రం : కృష్ణాష్టమిని మండలంలోని పలు గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించారు. లింగసముద్రంలోని గోపాలనగర్‌లో గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, కల్లగుంట ప్రసాద్, కల్లగుంట శివ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు పలువురు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.అలాగే రాధాకృష్ణుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కలిగిరి : మండలంలో సోమవారం కృష్ణాష్టమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు తల్లులు తమ చిన్నారులకు కృష్ణుడి వేషం వేయించి పెద్దల చేత ఆశీర్వచనాలు ఇప్పించారు. ఇంటిల్లపాది కలిసి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అల్లూరు : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఉదయం మండలంలోని వైష్ణవాలయాల్లో ప్రారంభమయ్యాయి. అల్లూరు వేణుగోపాలస్వామి ఆలయం, గీతాశ్రమంతోపాటు పలు ఆలయాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. గీతాశ్రమంలో ఉదయం శ్రీకృష్ణ నామ జప పారాయణ హోమం గోమాత పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి వద్ద సాయంత్రం ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాలుడి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఉదయగిరి రూరల్ : మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నేలటూరు, సున్నంవారిచింతల, గండిపాళెం, ఉదయగిరి, అప్పసముద్రం, కృష్ణారెడ్డిపల్లి, జీ.చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, గుడినరవ, ఆర్లపడియ, కుర్రపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.పలువురు తమ చిన్నారులకు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలు వేయించారు.


జలదంకిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

దుత్తలూరు : సెంటర్‌లో త్రైత సిద్ధాంత వారి ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి అందులో స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

వరికుంటపాడు : మండలంలోని గువ్వాడిలో కృష్ణాష్టమిని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం కన్నయ్య పవళింపు సేవతోపాటు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అల్పాహారం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వింజమూరు : పటణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న కృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఉభయకర్తగా బైనబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ వ్యవహరించారు. శంకర్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు : శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో యాదవ వీధిలోని కృష్ణ మందిరం, టెంకాయతోపులోని రాధాకృష్ణుల మందిరంలో ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పచ్చిపాల మోహన్ ఇంటి వద్ద నుంచి ఉభయ కలశం, పూజా సామగ్రి, పట్టువస్త్రాలతో మంగళవాయిద్యాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా యాదవ వీధిలోని కృష్ణమందిరానికి చేరుకున్నారు. వేడుకగా వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. టెంకాయతోపులో రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. అలాగే మండలంలోని చెర్లోయడవల్లి, బట్టేపాడు, తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సంగం : స్థానిక తూర్పువీధిలోని కృష్ణమందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక శివాజీ సెంటర్‌లో కక్కిరాల భవిక్ అనే ఆరు నెలల చిన్నారి చిన్నికృష్ణుడి వేషధారణ ఆకట్టుకుంది.

ఏఎస్ పేట : స్థానిక కృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

చిత్రగుంట : మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బోగోలు యాదవపాలెంలో కొలువైఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు వేదగిరి శ్యాంసుందరాచార్యులు, వెంకటాచార్యులు వేణగోపాలుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నూకసాని శ్రీనివాసులుయాదవ్-రాజ్యలక్ష్మి, పూర్ణచంద్రరావు-మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సంతానగోపాలకృష్ణుడి ఆలయం, చెంచులక్ష్మీపురం, నాగులవరం, ఎస్వీపాలెం, జువ్వలదిన్నె గ్రామాల్లోని కోదండరామాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరు : శ్రీకృష్ణజన్మాష్టమిని పట్టణంలోను, పరిసర గ్రామాలలోను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మరికొన్నిచోట్ల యువకులు ఉట్టికొట్టే వేడుకల్లో పాల్గొన్నారు. కాళిదాసువారివీధిలోని చిన్నికృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. పట్టణంలోని తూర్పుయాదవపాలెంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు.

జలదంకి : కృష్ణాష్టమిని మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జలదంకి యాదవబజారులోని కృష్ణమందిరంలో వైభవంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు పాల్గొని సందడి చేశారు. స్థానిక శ్రీసాయి స్కూల్స్ కరస్పాండెంట్ బత్తిన అయ్యలరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.


కావలి : గీతామందిరంలో ప్రత్యేక అలంకారంలో కృష్ణభగవానుడు, ఆత్మకూరు : యాదవవీధిలో రుక్మిణి సమేత శ్రీకృష్ణుడి కల్యాణం


సంగం : కృష్ణమందిరంలో పూల అలంకరణ, ఏఎస్ పేట : కృష్ణమందిరంలో పూజలు చేస్తున్న భక్తులు


చిట్రగుంట : భక్తుల పూజలు అందుకుంటున్న వేణుగోపాలస్వామి


కందుకూరులో ఉట్టి కొడుతున్న యువకులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

సంగం, ఆగస్టు 26: మండలంలోని దువ్వూరు నడిబొడ్డున అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహ వచనం, తదితర పూజలు జరిగాయి. మంగళవారం బాలాంజనేయస్వామి గ్రామోత్సవం, 28న విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


కలిశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 26: మండలంలోని భైరవరంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, గొల్లపల్లి మోహన్‌రావు, పందిటి అంబేద్కర్, బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిమ్మ మొక్కలు తొలగించకుంటే చర్యలు

కలువాయి, ఆగస్టు 26: మండలంలోని మాదన్నగారిపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రాత్రికి రాత్రి నాటిన నిమ్మ మొక్కలను మంగళవారం సాయంత్రం లోపు తొలగించాలని, లేనిపక్షంలో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులను హెచ్చరించినట్లు వీఆర్వో జనార్ధన్ తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైన విషయం ప్రతికల్లో రావడంతో సోమవారం ఆయన భూములను పరిశీలించి బోర్డు ఏర్పాటు చేశారు.


ఆక్రమణకు గురైన భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో జనార్దన్

బీద లక్ష్మానంద్‌కు అబ్దుల్‌కలాం పురస్కారం



పురస్కారం అందుకున్న బీద లక్ష్మానంద్

కావలి, ఆగస్టు26: డివిజన్‌లో విశేషసేవలందిస్తున్న ప్రముఖ రక్తదాన చైతన్యకర్త బీద లక్ష్మానంద్‌కు ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయసేవా పురస్కారాన్ని అందచేశారు. విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ రెండో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో సంస్థ అధ్యక్షుడు మల్లాది ప్రసాద్‌రావు చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత మాట్లాడుతూ తన సేవలు గుర్తించిన విజయవాడ మదర్‌సర్వీస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల ఆధారాలివిగో..

● వాస్తవం కాదని నిరూపిస్తారా ? ● కావలి టీడీపీ నాయకులు

కావలి, ఆగస్టు26: స్థానిక రియల్టర్లు 123 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, అందుకు తగిన ఆధారాలను టీడీపీ నేతలు వెల్లడించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, నాయకులు దావులూరు దేవకుమార్, దేవకొండ శ్రీనివాసులు మాట్లాడారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి జాతీయ జెండా ఐకానిక్ వద్ద చర్చకు సిద్ధమా ? అని వారు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డికి, వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఆక్రమణలు వాస్తవం కాదని నిరూపిస్తే మీరు విధించే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ విషయంలో మాజీ ఎమ్మెల్యే ఉలిక్కిపడుతుండటం చూస్తే, ఆ అక్రమాల్లో ఆయనకు వాటా ఉందనే అనుమానం నిజమని అర్థమవుతోందన్నారు. కొత్త అధికారులు వచ్చాక వైసీపీ అవినీతి, అక్రమాల బండారం బయటకు వస్తోందన్నారు. టీడీపీపై అనవసర విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మొగిలి కల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పోట్లూరు శ్రీనివాసులు, ఏగూరి చంద్రశేఖర్, అర్షియాబేగం, రహీం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తైక్వాండో పోటీల్లో కందుకూరు క్రీడాకారులకు పతకాలు

కందుకూరు, ఆగస్టు 26: విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏషియన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కందుకూరు క్రీడాకారులు పలు పతకాలు సాధించారని మాస్టర్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు కందుకూరు నుంచి ఐదుగురు క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ఇద్దరు బంగారు పతకాలు, ఇద్దరు కాంస్య పతకాలు, ఒకరు రజితపతకం సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఐటీఎఫ్‌యూ ఇండియన్ గ్రాండ్‌మాస్టర్ బీవీ రమణయ్య, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, డాక్టర్ జహంగీర్‌లు అభినందించారని ఆయన తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో గాండ్‌మాస్టర్, కోచ్ తదితరులు

తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

జిల్లా స్థాయి తైక్వాండో సీనియర్ బాలబాలికల ఎంపిక, ఖేలో ఇండియా తైక్వాండో పోటీలు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో సోమవారం జరిగాయి.తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది బాలబాలికలు హాజరయ్యారు. వివిధ విభాగాల్లో ఐదుగురు క్రీడాకారులు బంగారుపతకాలు సాధించారు. చీరాలకు చెందిన వి. వినీత, పి. భానురేఖ, జి. శివనాగసాయిలు, కందుకూరుకు చెందిన ఎస్కే. మసూద్, ఎస్కే. సాహిద్‌లు బంగారు పతకాలు సాధించారని, వీరంతా ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కందుకూరు, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదు ను విజయవంతంగా చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలోనై బీజేపీ కమిటీ ఏర్పడేలా కృషిచేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు, బెల్లంకొండ మాల్యాద్రి నాయుడు, జొన్నాదుల సురేష్, రాఘవయ్య, చుండి మురళీధర్, బొర్రా కోటేశ్వరరావు, జగన్నాథం వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

సంగం, ఆగస్టు 26: స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆటో డ్రైవర్లకు సీఐ వేమారెడ్డి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఆటో ఎక్కితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

కావలిటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని 36వ వార్డు చెరువుకట్ట గిరిజన సంఘంలో చెడిపోయిన బోరు వద్ద గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఆందోళన చేపట్టారు. మహిళల ఆందోళనకు సీపీఎం సంఘీభావం తెలిపింది. సీపీఎం పట్టణ కార్యదర్శి పీ పెం చలయ్య మాట్లాడుతూ గిరిజన సంఘంలో బోరు చెడిపోయి రెండునెలలైనా ఇప్పటికీ బాగుచేయలేదన్నారు. తాగునీటి వసతి లేకపోతే ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. పాలకులు ఎన్నికల హామీలు అమలు చేయాలని, ప్రత్యేకంగా పేదలు, గిరిజనుల నివసించే ప్రాంతాల పట్ల దృష్టి పెట్టాలన్నారు.


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

గుడ్లూరు, ఆగస్టు 26 : స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల సీపీఎం శాఖ డిమాండ్ చేసింది. సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సమావేశంలో ఆపార్టీ నాయకులు మాట్లాడారు. గుడ్లూరులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెయిన్ బజార్‌కు ఇరువైపులా కొందరు వ్యాపారులు ఆక్రమణలతో ముందుకు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీ వెంకటేశ్వర్లు, దామా కృష్ణయ్య, జీ స్టాలిన్, కొట్టే వెంకయ్య, ఎం. వెంకటేశ్వర్లు, నేలటూరి తిరుపాలు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

అల్లూరు, ఆగస్టు 26 : ఎస్ఐగా కోట్ర కిషోర్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి వీఆర్‌కు బదిలీ కాగా, కండలేరు ఎస్ఐగా పనిచేస్తున్న కిషోర్ బాబు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదన్నారు.

దుత్తలూరులో...

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 26: దుత్తలూరు ఎస్ఐగా సోమవారం పీ.ఆదిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఉమాశంకర్‌ను కలిగిరి ఎస్ఐగా బదిలీ చేయగా, జలదంకి ఎస్ఐగా ఉన్న ఆదిలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారు. సమిష్టి సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

రేపటి నుంచి స్వీయమదింపు పరీక్షలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 28 నుంచి వచ్చేనెల 4 వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వీయమదింపు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రశ్నపత్రాలతో మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలన్నారు. 1 నుంచి 5వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలు స్కూల్‌కాంప్లెక్సుల నుంచి ఏరోజుకారోజు ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని, 6 నుంచి 10వ తరగతుల ప్రశ్నపత్రాలు ఎంఈవో కార్యాలయం నుంచి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

వింజమూరు, ఆగస్టు 26 : మండలంలో ఈనెల 19న జరిగిన మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటును ఎంఈవో ఇష్టారాజ్యంగా చేశారని ఏపీటీఎఫ్ (1938) జిల్లా గౌరవాధ్యక్షుడు వీ శివకోటారెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జడ్.మోహన్‌రెడ్డి, పీ కొండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లకు మాత్రమే సర్దుబాటు జరగ్గా, ఓ గణిత ఉపాధ్యాయుడు జడ్పీహెచ్ఎస్ వింజమూరుకు అంగీకారం తెలిపారు. ఒక ఎంటీఎస్ ఉపాధ్యాయుడు లాస్ ఆఫ్ పే సెలవులో ఉండి, కౌన్సెలింగ్ గైర్హాజరై డివిజనల్ లెవల్‌కి ఆప్షన్ ఇచ్చారని పేర్కొన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల సమక్షంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌ను అవహేళన చేస్తూ జిల్లాలోఎక్కడ జరగని విధంగా రాత్రికిరాత్రే ఆ ఉపాధ్యాయుడిని గుండెమడకలలో నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిబంధనలను తూట్లు పొడవడం జరిగిందన్నారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిబంధనల మేరకు సర్దుబాటులో మార్పులు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 26 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరు వాగు, పెదపవని సమీపంలోని ఉప్పుటేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఎస్సై బాజీబాబు, సిబ్బంది దాడి చేసి నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని, డ్రైవర్లను, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పేడదిబ్బలతో పొంచి ఉన్న వ్యాధులు

వరికుంటపాడు, ఆగస్టు 26: మండలంలోని గువ్వాడి గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు రోగకారకాలుగా ఉన్నాయి. సమీపంలోనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నా, కొంతమంది రహదారి పక్కనే పేడదిబ్బలు వేశారు.దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలతోపాటు వాహనదారులు ప్రతినిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేడదిబ్బలు తొలగించాల్సి ఉంది.


రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు

వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు

ఆలయాలలో ప్రత్యేక పూజలు
ఉట్టి ఉత్సవాలు


కోవూరు: వీరాంజనేయస్వామి ఆలయంలో కృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకుడు


బుచ్చిరెడ్డిపాళెం: త్రైత సిద్ధాంత ప్రబోధ ఆధ్వర్యంలో కృష్ణుడికి పూజలు


ఇందుకూరుపేట: పూజలు నిర్వహిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు

కోవూరు, ఆగస్టు 26: స్థానిక వీరాంజనేయస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో పూలంగిసేవ, పల్లకీసేవచేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ పూజారులు కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. స్థానిక కొత్తూరు రోడ్డు, కోనేటి కయ్యలు, శాంతి నగర్ ప్రాంతాల్లో, ఇనమడుగు, పాటూరు గ్రామాల్లో యువకులు ఉట్టికొట్టి సందడి చేశారు. పడుగుపాడులోని కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

●**వెంకటాచలం:** స్థానిక శ్రీకృష్ణ మందిరంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత రాధాకృష్ణుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు అలరించారు. అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మనోజ్‌కుమార్ గుప్తా, చల్లా రమణయ్య, మందిపాటి రమేష్‌బాబు, పుత్తూరు వెంకటరత్నం, వర్ధగల్లు హరిబాబు, గజ్జల శంకరయ్య, తదితరులున్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం :** స్థానిక పైడావారి వీధిలోని కృష్ణమందిరం, శాంతి నగర్ వేణుగోపాలస్వామి ఆలయం, కృష్ణ, రామ, బాబా మందిరాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెనుబల్లిలో రామాలయం, జొన్నవాడలో శ్రీవరదరాజస్వామి ఆలయం, పలు గ్రామాలలో వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాలు చేశారు. అలాగే త్రైత సిద్ధాంత ప్రబోధ ఆధ్వర్యంలో గిరిజాహాల్ సెంటర్లో శ్రీ కృష్ణ పరమాత్ముడి ప్రతిమను కొలువుదీర్చి పూజలు చేశారు.

పున్నూరులో...

ఇందుకూరుపేట: మండలంలోని పున్నూరు గ్రామంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి చెంచుకిషోర్‌యాదవ్, మాజీ సర్పంచ్ పి లక్ష్మీ, జిల్లా యాదవ సంఘం నాయకులు ఉడతా నరసింహయాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెంచలకోనలో..

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణపరమాత్మకి నవ కలశ స్థాపన, తిరుమంజన సేవ, కల్యాణోత్సవం, ఉట్టి మహోత్సవం, గోపూజ, ఆస్థాన సేవ, శేషవాహన సేవ క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచినీరు సరఫరా, అన్నదానం తదితర కార్యక్రమాలు ఆలయ సిబ్బంది, ఉపకమిషనర్, కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్‌బాబు తెలిపారు.

●**సైదాపురం:** మండల పరిధిలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊటుకూరు కృష్ణ మందిరంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. చాగణరాజుపాళెం గ్రామంలో పుల్లంరాజు జ్ఞాపకార్థం దాతలు గుంటమడుగు కిషోర్‌రాజు, సుజాత సహకారంతో వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు నోట్‌బుక్స్, చెప్పులు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు రాజేష్ రాజు, స్రవంతి, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

●**విడవలూరు :** కృష్ణాష్టమి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

పోర్టులో గోకులాష్టమి


పోర్టు సీఈవో జీజేరావు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

ముత్తుకూరు, ఆగస్టు 26: అదానీ కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ భవనంలో సోమవారం సాయంత్రం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పోర్టు పరిపాలన భవనంలో పోర్టు సీఈవో జీజేరావు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్మికులు, ఉద్యోగులందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. ఉద్యోగులందరూ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఫైనాన్సర్ గుడివాడ శ్రీకాంత్, మృత్యుంజయరామ్, రమేష్‌బాబు, వెంకటేష్, భాస్కరన్, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్‌యాదవ్, పోర్టులోని వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెండి నందిసేవ


కామాక్షితాయి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో సోమవారం కామాక్షితాయికి పెద్ద వెండినంది సేవ గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను అలరించింది.

ఆర్యవైశ్యుల వినూత్న కార్యక్రమం


మణిస్వామి దంపతులను సన్మానిస్తున్న నేతలు

పొదలకూరు, ఆగస్టు 26 : గ్రామంలో ఆర్యవైశ్య సంఘం వారు సోమవారం విన్నూత కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని రామమందిరం వీధిలో కొప్పురావూరి మణిస్వామి, మహాలక్ష్మీ దంపతులు అతి తక్కువ ధరలతో గత 28 ఏళ్లుగా టిఫిన్ దుకాణం సేవా భావంతో నిర్వహించేవారు. సోమవారం ఆయన తన వ్యాపారానికి విరామం ప్రకటించి, ఆ దుకాణాన్ని మరో ఆర్యవైశ్య మిత్రుడికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా అప్పజెప్పారు. దీంతో ఆర్యవైశ్యులంతా మణిస్వామి దంపతులకు వ్యాపార విరమణ సన్మానాన్ని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, వర్కింగ్ సెక్రటరీ పొట్టి సుధాకర్, కార్యదర్శి పిన్నెల ప్రభాకర్, టౌను అధ్యక్షుడు గుర్రం మీరా మధు, ముఖ్య అతిథులుగా టీడీపీ తిరుపతి పార్లమెంటు రైతు సంఘం నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చేతికి వచ్చిన పంట నాశనమైంది

● బాధితురాలి ఆవేదన


మొలకెత్తిన పంటను బీజేపీ నాయకులకు చూపిస్తున్న బాధితురాలు విజయమ్మ

ఇందుకూరుపేట, ఆగస్టు 26: మండలంలోని కొత్తూరులో నివాసం ఉంటున్న ఈదురు విజయమ్మకు చెందిన ఎకరా 40 సెంట్లు భూమిలో వరిపంట పూర్తిగా నాశనమైందని సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలోని మురికి నీరంతా తన పొలంలోకి ప్రవేశించడంతో చేతికి వచ్చిన పంట మొలకెత్తిందని ఆమె తెలిపింది. నష్టపోయిన పంటను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి పరిశీలించి తక్షణమే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు స్పందించి మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, నెల్లూరు శ్రీనివాసులు, వెంకట్రావు, మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో ప్రతి గ్రామానికి మినరల్ వాటర్

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి


గిరిజన కాలనీలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

పొదలకూరు, ఆగస్టు 26: మండలంలోని ప్రతి గ్రామానికి త్వరలో మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకుపల్లిలో సోమవారం ఆయన పర్యటించారు. గిరిజన కాలనీలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కిట్లు, ఏడాదికి సరిపడా నగదును అందజేశారు. అనంతరం జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఇన్విటేషన్ మెగా టోర్నమెంట్‌ని సందర్శించి టోర్నమెంటులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, ప్రెసిడెంట్ వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్ బి మల్లికార్జుననాయుడు, చంద్రశేఖర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాధి రాళ్లలా జగనన్న భూరక్ష సర్వే రాళ్లు

జగనన్న భూరక్ష సర్వే రాళ్లు సమాధి రాళ్లలా మిగిలాయని, కోట్ల రూపాయలు నేలపాలు చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలం అంకుపల్లి ఎస్టీ కాలనీకి వెళ్లగా వృథాగా గుట్టగా పడివున్న జగనన్న హద్దురాళ్లు కనిపించాయి. దీంతో సోమిరెడ్డి కొద్దిసేపు వాటిని పరిశీలించారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు


అర్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, ఆగస్టు 26: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకుడు అర్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఊటుకూరులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పేదలకు పంచారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయబానురెడ్డి, టీడీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సీఐ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని పందులోళ్ళకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. రౌడీ మూకలకు మద్దతుగా ఎవ్వరొచ్చినా ఉపేక్షించేది లేదంటూ దందా నాయకులను హెచ్చరించారు. ఆగడాలు శృతిమించితే రౌడీషీట్లు తెరుస్తామన్నారు.

సీఐకి క్రీడాకారుల సత్కారం

స్థానిక టీడీపీ నాయకుడు బండ్ల కొండయ్య, పలువురు క్రీడాకారులు సోమవారం బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. సీఐని కలిసిన వారిలో బాబు, కౌసిక్, లక్ష్మయ్య, సురేష్, మధు తదితరులున్నారు.

పొదలకూరు ఎస్ఐగా హనీఫ్

పొదలకూరు, ఆగస్టు 26: పొదలకూరు నూతన ఎస్ఐగా హనీఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా గంజాయి, పేకాట, కోడిపందాలు నిర్వహిస్తుంటే సమాచారం 100కు గాని 94407 00007కు సమాచారం అందించాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ అక్తర్‌బాషా, రఫీ, కానిస్టేబుల్స్ మదన్‌కుమార్, ఇస్మాయిల్, హోంగార్డులు షరీఫ్, రమేష్, రామకోటయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మండలంలోని అమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం పొదలకూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులు, రూ.4150 నగదు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. విధుల్లో చేరిన తొలిరోజే పేకాట స్థావరంపై దాడి చేయడంతో నూతన ఎస్ఐ హనీఫ్‌కు పొదలకూరు పట్టణ, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

కసుమూరు దర్గా హుండీ లెక్కింపు

వెంకటాచలం, ఆగస్టు 26: కసుమూరు మస్తాన్‌వలి దర్గా హుండీ లెక్కింపు సోమవారం వక్ఫ్‌బోర్డు అధికారుల ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ సమక్షంలో దర్గా ముజావర్లు, గ్రామస్థుల పర్యవేక్షణలో జరిగింది. హుండీ లెక్కింపు ప్రక్రియను వెంకటాచలం సీఐ సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దారు మురళీ, జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు పర్యవేక్షించారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కోవూరు, ఆగస్టు 26: కోవూరు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ సుధాకరరెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసే స్థలాన్ని నిర్వాహకులు ముందుగా తెలియచేసి అనుమతి తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించే విధంగా విగ్రహాల్ని ఏర్పాటుచేయకూడదని, భారీ శబ్దాలు వచ్చే డీజేలను వినియోగించకూడదన్నారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని చెప్పారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ముకుందా.. ముకుందా..

● వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు


బాలాజీ నగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహాలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 26: నగరంలోని ఆలయాలు, ఇంటింటా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. హరేకృష్ణ నామస్మరణలు మారుమ్రోగాయి. ఇస్కాన్ మందిరంలో అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో మూలవరులకు విశేష పుష్పాలంకరణ జరిగింది. బాలకృష్ణుడికి ఊంజల్‌సేవలు నిర్వహించారు. భక్తులతో రాధాకృష్ణులకు పంచామృతాభిషేకాలు జరిగాయి. భక్తులు భారీగా తరలిరావడంతో ఇస్కాన్ రోడ్డులో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం భజనలు, కీర్తనలు వీనులవిందు చేశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రాధాకృష్ణులకు అభిషేకాలు, మహా అరతి, 108 వంటకాల నివేదన జరిగాయి.

● మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మూలవరులకు విశేష అభిషేకాలు, పూలంగిసేవ, బాల కృష్ణుడి పాదముద్రల అలంకారం జరిగింది. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఏసీ డి.చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.


ఊయల సేవలో శ్రీకృష్ణుడు


శ్రీకృష్ణుడి సేవలో కళాకారిణులు


నృత్యం చేస్తున్న చిన్నారులు

● నగరంలోని సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. మూలవిరాట్‌కి పాలా భిషేకం, ఉత్సవమూర్తికి భక్తులతో క్షీరాభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తుల గోవిందనామస్మరణల మధ్య పుష్పాభిషేకం, సాయంత్రం పల్లకీ సేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా నిక్కదల గిరికుమార్‌యాదవ్, నిర్మల దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగాంగా ఉదయం తులసీదళం, బంగారు పుష్పాలతో అర్చన, సా యంత్రం కృష్ణ భక్తులచే ఉట్టి మహోత్సవం ఉత్సాహభరితంగా జరి గింది. అనంతరం మహిళా భక్తులచే కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

● బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో బాలాజీనగర్ యూత్, చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తాత్కాలిక కృష్ణస్వామి విగ్రహాలు ఏర్పాటు చేసి కృష్ణాష్టమి వేడుకలు ప్రారం భించారు. కార్యక్రమానికి ఆనం చెంచుసుబ్బారెడ్డి, జనసేన నాయ కులు గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి సుజన్‌బాబు పాల్గొని విగ్రహా లను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు.

● స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో రాధాకృష్ణ విగ్రహాలకు విశేష అలంకారం, పూజలు జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణ, రాధా గోపికల వేషధారణలలో భక్తులను అలరింపచేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, అర్చకులు లలితా శివకుమార్‌స్వామి పర్య వేక్షించారు.

● నగరంలో కాంత్రినగర్‌లో శివకేశవస్వామి ఆలయంలో కృష్ణస్వామికి విశేష అలంకారం పూజలు జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ ఎన్.భానుశ్రీ, మోదం మల్లికార్జున రావులు పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. రాత్రి ఉట్టి మహోత్సవం జరిగింది. శాంతినగర్ ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండ బలరామిరెడ్డి ప్రారంభించారు.


మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో తులసీదళార్చన

ఆమని గార్డెన్స్‌లో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఆమని గార్డెన్స్‌లో జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, మాజీ కార్పొరేటర్ విశపు లలితా రామ్, లాయర్ శ్రీరామ్, నాగిశెట్టి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాకు నివాళి


మదర్‌థెరిస్సాకు నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 26 : నెల్లూరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా పాస్టర్లు ఘన నివాళులర్పించారు. లోన్‌స్టార్ చర్చిలో ఆమె చిత్రపటానికి పుష్పమాల వేసి ఆమె త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు బెనహర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కె.విజయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ యేసురత్నం, మీడియా కార్యదర్శి సదాశివరావు, ఏ.జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నేడు నిరసన ప్రదర్శన

● అవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 26 : ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరే కంగా మంగళవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫి తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. వక్ఫ్ చట్టానికి తూట్లు పొడిచేలా చట్ట సవరణ ఉందని విమర్శించారు. ఇప్పటి వరకు పాలించిన ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు వక్ఫ్ భూములను నిర్వీర్యం చేశారన్నారు. వాటిని కాపడమని చెప్పిన సచార కమిటీ, రంగనాథ్ మిశ్రా సిఫార్సులను పక్కన బెట్టి మైనార్టీల అభివృద్ధికి సహకరించ కపోగా చట్ట సవరణల పేరుతో నష్టం చేస్తున్నారన్నారు. అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ జిల్లాలోని 1200 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అక్రమదారుల నుంచి విడిపించి మైనార్టీల అభివృద్ధికి వినియోగిం చాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో జిల్లాలోని మసీదు, మకాన్, ఈద్గా కమిటీలు, మైనార్టీ ముస్లింలు, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్ర మంలో అవాజ్ కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ చాన్‌బాషా, షేక్ ఫయాజ్ పాల్గొన్నారు.

వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుడి కల్యాణం


నృసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 26 : నగరంలోని పద్మావతినగర్ సాయిదర్బార్ వద్ద ఉన్న శ్రీసాయిమాతా అన్నప్రసాద నిలయం తృతీయ వార్షికోత్సవం, శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సోమవారం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత పెనుశిల లక్ష్మీనృసింహస్వామిల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మూర్తులకు విశేష పుష్పాలంకారం చేసి వేద మంత్రోశ్ఛరణలు, ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలతో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తనలు, పండరి భజనలు, కోలాటాలు భక్తులకు కనువిందు చేశాయి. కల్యాణానికి హాజరైన భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఉభయకర్తలుగా నున్నా కిరణ్‌కుమార్, సుధా, స్వరాజు మురళీధర్‌రావు, అన్నపూర్ణ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఈ వేడుకలు సాయిదర్బార్ చైర్మన్ మధుసాయి, సభ్యులు వేదగిరి ఫణిశర్మ, పాబోలు రామసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.

ఆలయాల కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 26: నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాల్లోని పలు ఆలయాలకు ధర్మకర్తల మండలిలు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందని దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్ మండలంలో వేదగిరి (దేవరపాలెం) లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మూలాపేటలోని నెల్లూరు నగర గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయాలకు, నెల్లూరు నగరం దర్గామిట్టలో వెలసి ఉన్న రాజరాజేశ్వరి ఆలయానికి ఏర్పాటు కానున్న ధర్మకర్తల మండళ్లకు ఆసక్తి ఉన్న ఆధ్యాత్మిక సేవా భావం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటు ఆయా ఆలయాల ఇన్‌చార్జి ఈవో సుధీర్, రాజరాజేశ్వరి ఆలయ సహాయ కమిషనర్ బి.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ దరకాస్తులు సెప్టెంబరు 11వ తేదీలోగా గుంటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ ఉపకమిషనర్ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు.

ఏసీ స్టేడియంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 26: జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు, వాకర్స్ సంఘాలు, వాకర్స్ ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్ మాట్లాడుతూ జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు క్రీడా కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా తొలిరోజు అందరితో క్రీడా ప్రతిజ్ఞ చేయించామన్నారు. 27న 18 నుంచి 40 ఏళ్ల లోపు వారికి 100 మీటర్ల పరుగు పందెం, బ్రిస్క్‌వాక్, చెస్, బ్యాడ్మింటన్, పురుషుల వాలీబాల్ పోటీలుంటాయన్నారు. 40 నుంచి 60 ఏళ్ల లోపు వారికి 50 మీటర్ల పరుగు, 300 మీటర్ల నడక, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలను, 60 ఏళ్లు పైబడిన వారికి 50 మీటర్ల వాకింగ్, యోగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈవో వై.వెంకటయ్య, కోచ్‌లు పాల్గొన్నారు.

విజయవాడ సదస్సుకు

భూ బాధితులు తరలిరావాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 26 : విజయవాడలో ఈ నెల 28వ తేదీన జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు బాధితులు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపు నిచ్చారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తదతర నేతలు పేదల భూములను లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. ఈ సందర్భంగా నేతలు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు సయ్యద్ సిరాజ్, షాన్‌వాజ్, నందిపోగు రమణయ్య, మున్నా, శంకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● రూ.1,04,900 స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 26: నగరంలోని బాలాజీ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో సోమవారం రాత్రి పేకాట కేంద్రంపై దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు పేకాట స్థావరంపై దాడులు చేసి 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,04,900 స్వాధీనం చేసుకున్నారు.


సింహపురి సాంస్కృతిక సమాఖ్య వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 26 : నగరంలోని పురమందిరంలో సోమవారం రాత్రి సింహపురి సంస్కృతి సమాఖ్య 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, మెజీషియన్, హిప్నాటిస్ రాంజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యం.రాజ్‌కిషోర్ పాల్గొన్నారు. ఆయనను నిర్వాహకులు సన్మానించారు. శృతిసమన్వి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పురప్రముఖులు ఆమెను ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి జమీన్‌రైతు సంపాదకుడు ఎన్. డోలేంద్ర ప్రసాద్ సభాధ్యక్షుడిగా వ్యహరించగా పద్మ కళాపరిషత్ అధ్యక్షుడు ఎం.ఆర్.ప్రసాద్, సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ పి.రాఘవరెడ్డి, కేఎస్ఆర్ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.విజయప్రకాష్‌రావు, దుగ్గి మధు, ఉప్పు భాస్కర్, కేఎస్.రాయల్, హైటెక్ రమణారెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ భవన నిర్మాణానికి రేపు భూమి పూజ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 26 : నగరంలోని కుసుమ దళితవాడలో ఎమ్మార్పీఎస్ శాశ్వత భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేయనున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ తెలిపారు. సోమవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ భవనం కోసం కుసుమ దళితవాడకు చెందిన పీ.నారాయణమ్మ తన సొంత స్థలం 10 అంకణాలు మాదిగ జాతికి విరాళంగా ఇచ్చారన్నారు. ఈ స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. దాత నారాయణమ్మ మాట్లాడుతూ మాదిగలు సమావేశాలు నిర్వహించుకోవడానికి నగరంలో ఎక్కడా సొంత భవనం లేదని, అందుకే తన స్థిరాస్తిని విరాళంగా ఇచ్చానని చెప్పారు. భవన నిర్మాణానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకరిస్తానని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎమ్మార్పీఎస్‌కు సొంత భవనాలు లేవని, తొలిసారిగా నెల్లూరులో భవనాన్ని నిర్మించనుండడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందన్నారు. ఈ సమావేశంలో అరవ కామాక్షి, జలదంకి మరియమ్మ, శాంతమ్మ, రంగవల్లి ధర్మమ్మ, మంద కామాక్షి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో అష్టసఖులతో రాధాగోవిందులు

బాలకృష్ణం భజే

వాడవాడలా వైభవంగా కృష్ణాష్టమి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26 : శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుపతిలోని అష్టసఖీ సమేత రాధాగోవింద కమల మందిరం(ఇస్కాన్)లో జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వేకువ జామున నాలుగు గంటల నుండి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 11.45 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరిగింది. యువత ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. రాత్రి 11 గంటలకు రాధాగోవిందులకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. ఇస్కాన్ ఆలయానికి వచ్చే అన్ని దారులు మూసివేసి ఆలయానికి వచ్చేవారిని మాత్రమే అనుమతించారు. తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన మధుర ఆలయం నమూనా సందర్శకులను ఆకట్టుకుంది.సాయంత్రం 6.30 గంటల నుంచి నృత్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



తిరుపతి తుడా మైదానంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న గోవర్ధనగిరిధారి, మధుర ఆలయ నమూనా



ఇస్కాన్ ఆలయానికి పోటెత్తిన జనం




ఇస్కాన్ గుడి పక్కనున్న మైదానంలో ఉట్లోత్సవం

పట్టాలెక్కని పాలన

కలెక్టర్, ఎస్పీ వంటి పాలనాధికారులు మినహా మిగిలిన శాఖల అధికారుల బదిలీలు ఇంకా జిల్లాలో మొదలు కాలేదు. కొత్త ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్యతా కార్యక్రమాలు, పథకాలపై అస్పష్టత కొనసాగుతోంది. ఎలాగూ బదిలీలు తప్పవన్న తలంపుతో వివిధ శాఖల జిల్లా అధికారులు అన్యమనస్కంగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో పాలనను సమన్వయపరచాల్సిన రాజకీయ నాయకత్వం కొరవడింది. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ఇంకా సర్దుబాట్లలోనే ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమై వుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన వివిధ శాఖల జిల్లా అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. కేవలం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మాత్రమే కొత్త ప్రభుత్వంలో బదిలీపై వచ్చారు. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు ఇంకా జరగలేదు. అలాగే జిల్లా పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, సహకార, డ్వామా, డీఆర్‌డీఏ, వైద్యారోగ్య, విద్య, పరిశ్రమలు, వ్యవసాయ సంబంధ తదితర ముఖ్యమైన శాఖల్లో జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల బదిలీలు జరగలేదు. తిరుపతి మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా కమిషనర్లదీ అదే పరిస్థితి. పోలీసు శాఖలో మాత్రమే ఎస్పీ మొదలుకుని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐల వరకూ బదిలీలు జరిగాయి. ఎస్‌ఐల బదిలీలు కొనసాగుతున్నాయి. తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లినవారు తిరిగి రాగా మండలాలు కేటాయించారు. ఇది మినహా 90 శాతం జిల్లా, డివిజన్‌స్థాయి అధికారుల బదిలీలు పెండింగులో ఉన్నాయి.

అన్యమనస్కంగా విధుల్లో అధికారులు

కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఎలాగూ బదిలీలు తప్పవని వివిధ శాఖల జిల్లా అధికారులు అన్యమనస్కంగా విధులకు హాజరవుతున్నారు. ఆయా స్థానాల్లో కొనసాగే పరిస్థితి లేనందున ఏకాగ్రతగా తమ శాఖల కార్యకలాపాల్లో నిమగ్నం కాలేకపోతున్నారు. చాలా మంది నామమాత్రంగా కార్యాలయాలకు వచ్చి కాలక్షేపం చేసి వెళుతున్నారు. కొందరు ఏదో ఒక మార్గంలో తమకు కావాల్సిన పోస్టింగుల కోసం ప్రయత్నాలు చేసుకుంటుండగా మరికొందరు ఎక్కడికి బదిలీ చేస్తే అక్కడికి వెళదామని ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. రెవెన్యూతోపాటు వివిధ శాఖల్లో డిప్యుటేషన్‌పై ఉన్న డిప్యూటీ కలెక్టర్లు మాత్రం కీలక పోస్టింగుల కోసం గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు.దీంతో పూర్తిస్థాయిలో తమ శాఖలపై దృష్టి కేంద్రీకరించడం లేదు.

కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలపై అస్పష్టత

కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ఇంకా ప్రాధాన్యతా పథకాలు, కార్యక్రమాలపై స్పష్టత రావడం లేదు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలు, కార్యక్రమాల్లో మార్పు చేర్పులపై నిర్ణయం తీసుకోలేదు. అదే సమయంలో కొత్త పథకాలు, కార్యక్రమాలు ఇంకా రూపుదిద్దుకోలేదు. దీంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి కొత్త ప్రభుత్వ ప్రాధాన్యాలేవన్నది జిల్లా అధికారులకు అంతుబట్టడం లేదు. ఫలితంగా వివిధ శాఖల అధికారులు యాంత్రికంగా కార్యాలయాలకు హాజరవుతున్నారు తప్పితే శాఖలపై క్షేత్రస్థాయిలో పర్యటనలు గానీ, పర్యవేక్షణలు గానీ, సమీక్షలు గానీ జరపడం లేదు. ఎలాగూ కొద్ది రోజుల్లో బదిలీ అవుతామన్న భావన దీనికి కారణంగా కనిపిస్తోంది.

కొరవడిన రాజకీయ నాయకత్వం

జిల్లాలో పాలన విషయంలో ప్రజాప్రతినిధులకు, అధికార యంత్రాంగానికీ నడుమ వారధిలా ఉండి సమన్వయపరిచే జిల్లాస్థాయి రాజకీయ నాయకత్వం లోపించింది. ఉమ్మడి జిల్లాకు రాజకీయంగా పెద్దదిక్కుగా పరిగణించే పలమనేరు, పీలేరు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో తమ తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు.మండల, నియోజకవర్గ స్థాయిలో పనులకు ఎమ్మెల్యేలు కలెక్టర్, ఎస్పీలను కలుస్తున్నారు. అయితే ఆ పరిధి దాటి ప్రభుత్వంలో చేయించాల్సిన పనుల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. డివిజన్ స్థాయి అధికారుల నియామకాల్లో ఒకటికిమించి నియోజకవర్గాలు వ ుండి పడి ఉన్నందున ఎమ్మెల్యేల నడుమ ఏకాభిప్రాయం సాధనకు కూడా జిల్లాస్థాయి నాయకత్వం అవసరమవుతోంది. అలాగే సాగునీటికి, పరిశ్రమలకు, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించి జిల్లాస్థాయి ప్రతిపాదనలు రూపొందించడంలోనూ, వాటిని ప్రభుత్వానికి పంపి మంజూరు చేయించడంలోనూ జిల్లా నాయకత్వం పాత్ర కీలకం. ఇపుడు ప్రత్యేకించి తిరుపతి జిల్లాకు ఆ లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. దీంతో జిల్లాలో కొత్త ప్రభుత్వం తాలూకూ పాలన పూర్తిస్థాయిలో పట్టాలెక్కడానికి మరికొంత సమయం పట్టనుంది.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 26 : తిరుపతిలో గంజాయిని దాచి విక్రయిస్తున్న ఇద్దరిని అలిపిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వచ్చే 100 రోజుల్లో తిరుపతి జిల్లాను డ్రగ్ రహితంగా మార్చాలనే సంకల్పంతో గంజాయి, మాదక ద్రవ్యాల సేవనం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి అరికట్టడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఓ టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ నేపథ్యంలో అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి కపిలతీర్థం రోడ్డు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద స్థితిలో కన్పించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి వద్ద గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా సదుం మండలం యర్రాతివారిపల్లెకు చెందిన పట్టాభి గుణశేఖర్, ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన కొండా మునిభరణిగా వారిని గుర్తించారు.గుణశేఖర్ బ్యాగులో 12 కిలోల గంజాయిని ,మునిభరణి బ్యాగులో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.యశోదానగర్‌లోని గుణశేఖర్ రూములో గంజాయిని నిల్వ చేసి చిన్న చిన్న పొట్లాలు కట్టి అవసరమైన వారు ఫోన్ ద్వారా సంప్రదిస్తే తీసుకెళ్ళి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు.మునిభరణిపై గతంలో కూడా మూడు గంజాయి కేసులున్నట్లు చెప్పారు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రాంకిషోర్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతిలో ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా...వినియోగిస్తున్నా...గోడౌన్లలో స్టాకు పెట్టినట్లు తెలిసినా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చిల్లకూరు, ఆగస్టు 26:వచ్చేనెల 6న చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు స్థల పరిశీలన చేపట్టారు. తమ్మినపట్నంలో క్రిస్ సిటీ సెజ్ శంకుస్థాపన కార్యక్రమానికి వారిద్దరూ రానున్నట్లు సమాచారం. శంకుస్థాపన స్థలం, హెలిప్యాడ్ , సభాప్రాంగణం వంటి ఏర్పాట్లపై సోమవారం పరిశీలించారు.డీఎస్పీ రమణకుమార్, తహసీల్దారు శ్రీనివాసులు, ఏపీఐఐసీ జడ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మదగజం అఘాయిత్యంతోనే ఆడ ఏనుగు మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 26 : వెంట తీసుకొచ్చిన మదగజం దాడి వల్లే ఆడ ఏనుగు మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికతో వెల్లడైంది.ఎర్రావారిపాలెం మండలం పులిబోనుపల్లె సమీపంలోని ఉరం గుట్ట వద్ద నాలుగురోజుల క్రితం మృతి చెందిన ఏనుగుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఏనుగు చెవుల నుంచి రక్తస్రావం జరిగిన్లు కనపడడంతో ఆంత్రాక్స్ వ్యాధి కావచ్చేమో అని తొలుత అనుమానించారు.నిర్ధారణ కోసం ఆ రక్తాన్ని తిరుపతిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. ఫలితం నెగటివ్ రావడంతో ఆంత్రాక్స్ వ్యాధితో మరణించలేదని తేలింది.సీసీఎఫ్‌వో నాగేశ్వర రావు, డీఎఫ్‌వో సతీష్ , ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వన్, వైల్డ్ లైఫ్ డాక్టర్ తోయిబా సింగ్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ , సర్పంచ్ దేవేంద్ర తదితరుల సమక్షంలో జరిగిన పోస్టుమార్టంలో పలు అసక్తికర విషయాలు బయటపడ్డాయి. మృతి చెందిన ఏనుగుకు 16 సంవత్సరాలుంటాయి.9నెలల గర్భంతో వుంది.అయితే ఏనుగు పిండం చెదిరిపోయి వుంది.తల భాగం, తొండం , దంతాల వద్ద బలమైన గాయాలున్నాయి. శరీరంపై రెండు చోట్ల లోతుగా పోట్లు ఉన్నాయి. కడుపులో బలమైన గాయాలుండడం , శరీరంలో రక్తం గడ్డ కట్టి ఉండడం గమనించారు. ఏనుగు మరణించిన స్థలానికి దగ్గర్లో రెండు ఏనుగుల మధ్య పోట్లాట జరిగిన ఆనవాళ్లున్నాయి.చెట్లు,కొమ్మలు విరిగిపోయి ఉండడం ,భూమిపై ఏనుగులు భీకరంగా తలపడినట్లు ఉండడంతో ఆడ ఏనుగుపై మదపుటేనుగు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎలిఫెంట్ రీసెర్చ్ సైంటిస్టు రాకేష్ కల్వ నిర్ధారించారు. దీంతో తొలుత ప్రచారం జరిగినట్లు ఏనుగు కరెంట్ తీగలు తగిలి మరణించిందనే విషయం నిజం కాదని తేలిపోయింది. విద్యుత్ లైన్ కూడా సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఉండడం గమనార్హం. సాధారణంగా మదపుటేనుగులను మిగతా ఏనుగులు మందకు దూరంగా ఉంచుతాయి. గుంపు యజమానిగా ఆడ ఏనుగులే వ్యవహరిస్తుంటాయి. గర్భంతో వున్న ఏనుగు మదపుటేనుగుతో మాత్రమే కలిసివచ్చింది. మధ్యలో దాంతో కలిసేందుకు మదపుటేనుగు ప్రయత్నించడంలో భాగంగా రెండింటి మధ్య పోరాటం జరిగింది. కోపంతో మదపుటేనుగు దాడి చేసిన క్రమంలోనే ఆడ ఏనుగు మృత్యువాత పడినట్లు అధికారులు నిర్ధారించారు.

కుంభాభిషేక వేడుకల్లో శాస్త్రోక్తంగా హోమం



సూళ్లూరుపేట, ఆగస్టు 26: మన్నారుపోలూరులోని సత్యా జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా సోమవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణ మండపంలో కలశస్థాపన చేశారు. హోమగుండాలు ఏర్పాటు చేసి యాగశాల వాస్తుపూజలు, రక్షాబంధనం, అష్ట బంధన సమర్పించారు. యాగశాలలో అకల్మష హోమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కోవిల్ అళ్వార్ తిరుమంజనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గూడూరు అర్బన్, ఆగస్టు 26: స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన టీములు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, ధనుంజయరెడ్డి, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పొదలకూరు జట్టుపై డక్కిలి ఉపాధ్యాయ జట్టు విజయం సాధించింది. జట్టును అభినందిస్తూ ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గద్దల మునెయ్య రూ.2వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు, ఆగస్టు 26: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



ఓజిలి, ఆగస్టు 26 : మండలంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓజిలి, కురుగొండ, మానమాల, ఆరిమేనిపాడు, అత్తివరం, వీర్లగునుపాడు, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో కృష్ణునికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఓజిలి ప్రధాన వీధిలో ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు, పిల్లలు, గ్రామస్తులు ఆసక్తిగా పాల్గొన్నారు.

వెటరన్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం



నాయుడుపేట, ఆగస్టు 26 : విశాఖపట్నం రైల్వే క్రీడా ప్రాంగణంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన వెటరన్ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. టీములో నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ గౌస్‌బాషా సోమవారం మీడియాకు తెలిపారు. ఏపీ, తెలంగాణ తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారన్నారు. మూడు రోజులపాటు పోటీలు జరిగాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

మురుగునీరు పోయేందుకు మార్గమేదీ?



నాయుడుపేట, ఆగస్టు 26 :స్థానిక పాత ట్రెజరీ ఆఫీసు ఎదురుగా సిమెంట్ రోడ్డు రూపుకోల్పోయింది. మురుగునీటిమయంగా మారింది. ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల కూడా ఉంది. విద్యార్థులు రోజూ ఆ మురుగునీటి నడుమ పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక పర్యాయాలు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మించి, డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేసినా మురుగునీరు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఎప్పటికప్పుడు రోడ్డుపైనే నిలిచిపోతోంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

శ్రీసిటీకి బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీసిటీ ప్రతినిధులు శివశంకర్, బోడ్గన్ జార్జ్

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ (బీఏఆర్‌సీ) ముంబైలో నిర్వహించిన గోల్డ్‌ఫెస్ట్ కాన్‌క్లేవ్ 2024లో బ్రాండ్ ఆఫ్ ది డికేడ్ అవార్డుతో శ్రీసిటీని సత్కరించింది. శ్రీసిటీ దశాబ్దకాలపు పారిశ్రామిక ప్రగతికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు శ్రీసిటీ ఎండీ డా. రవీంద్ర సన్నారెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్, శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోఎడ్గన్ జార్జ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎక్సలెంట్ ఫార్మా పేరుతో

మోసపూరిత ఉద్యోగ ప్రకటనలు

● నమ్మి మోసపోవద్దని యాజమాన్యం సూచన

శ్రీసిటీ, ఆగస్టు 26: శ్రీసిటీలోని ప్రముఖ ఫార్మలేషన్స్ పరిశ్రమ యెక్సలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొందరు మోసపూరిత ఉద్యోగ ప్రకటనలిస్తూ, నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఉపయోగిస్తున్నారని, అటువంటి ప్రకటనలు నమ్మవద్దంటూ ఆ కంపెనీ హెచ్‌ఆర్, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ కే.విజయభాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. యెక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్, హెచ్‌ఆర్ అట్ ది రైటాఫ్ యెక్సలెంట్ ఫార్మా డాట్‌కామ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలను ఉపయోగిస్తూ కొందరు ఉద్యోగాలిప్పిస్తామంటూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మోసగాళ్ల వలలో పడి ఎవరూ నష్టపోవద్దని, సంబంధిత వెబ్‌సైట్, ఈ మెయిల్ ఐడీలతో తమకెలాంటి సంబంధంలేదని వివరించారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, కంపెనీ తరఫున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

ఆటో బోల్తా: డ్రైవరుకు గాయాలు



చిల్లకూరు, ఆగస్టు 26: ఆటో బోల్తాపడిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... సోమవారం గూడూరు వైపు నుంచి ఓజిలి వైపు ముగ్గురు ప్రయాకులతో వెళుతోంది. ఈ క్రమంలో బూదనం టోల్‌ప్లాజా వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటో డ్రైవర్ కాలేషాకు గాయాలయ్యాయి. అతడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తూ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎలాంటి గాయాలు తగలలేదు.

నేడు పాలచ్చూరులో ప్రజాభిప్రాయ సేకరణ

పెళ్లకూరు, ఆగస్టు 26 : పాలచ్చూరు పరిధిలోని సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. దీనికి జిల్లా జాయింట్ కలెక్టర శుభమ్ హాజరవుతారని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఆదిత్యా బిర్లా గ్రూపు ఏర్పాటు చేయనున్న పరిశ్రమ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తిక్కవరంలో గడ్డివామి దగ్ధం

చిల్లకూరు, ఆగస్టు 26: మండలంలోని తిక్కవరం గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెంకటయ్య గడ్డివామిలో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పీకను వేశారు. దీంతో గడ్డివామిలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తిచెందాయి. స్థానికులు గుర్తించి గూడూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివామి కాలిపోయింది. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటయ్య తెలిపాడు.

రెండు బైకుల ఢీ - ఒకరి మృతి



పుల్లయ్య (ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 26 : రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలి వి..తూపిలిపాళెం గ్రామానికి చెందిన తులసంగారి పుల్లయ్య (37) సోమవారం తన కుమారుడికి సదరన్ సర్టిఫికెట్లను తీసుకు వచ్చేందుకు బైకు మీద నెల్లూరు వెళ్లాడు. తిరిగి తూపిలిపాళెంకు వస్తుండగా అందలమాల, తూపిలిపాళెం మధ్యలో మరో బైకు ఢీకొంది. దీంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అవతలి బైకులో ప్రయాణిస్తున్న గూడలికి చెందిన ముఖేష్,మరో మహిళ గాయపడ్డారు. వీరిద్దరినీ గూడూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత



పవన్‌కుమార్‌కు చెక్కును అందజేస్తున్న రమణయ్య

కోట, ఆగస్టు 26 : చదువుకోవాలన్న తపన ఉన్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య చెప్పారు. నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన పవన్ కృష్ణమాచార్యులు అనే విద్యార్థికి ముక్కర నవీన్‌బాబు-భవ్య దంపతుల(చెన్నై) రూ. 10వేల సాయాన్ని ప్రకటించారు. కోటలోని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ ఆర్థిక సాయాన్ని రమణయ్య అందజేశారు. ఏటా ఇదేవిధంగా సాయం అందజేస్తామని హామీ ఇచ్చార. సీతారామధార్మికసంఘం ప్రతినిధులు,ఆవుల సుబ్బయ్య, వెంకటరమణారెడ్డి, బాబురావు, అనంతాచార్యులు, పుల్లారెడ్డి, దామోదర్, పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 26 : కూచివాడలో భూ ఆక్రమణదారులపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గ్రామంలో స్వర్ణముఖి పొరంబోకు భూమిని కొందరు ఆక్రమించుకున్నారని తహసీల్దారు గీతావాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనను చంపుతానని ప్రసన్న అనే వ్యక్తి బెదిరిస్తున్నారని పెరికలంపాటికండ్రిగ గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.



దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకుడు కట్టా వెంకటరమణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. -నాయుడుపేట

బాలగోపాలుడికి ఊరూవాడా పూజలు





డక్కిలి మండలం చాపలపల్లిలో శ్రీకృష్ణుని ఊరేగింపు- చిన్నమాంబట్టులో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 26: షార్ బస్టాండు, పీర్ల చావడి వద్ద జై గణేశ్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కేఆర్‌పాలెంలోని సాయి సత్సంగ మందిరంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నాదెండ్లవారి కండ్రిగలో కృష్ణమందిరంలో అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, చిట్టేటి పెరుమాల్ పాల్గొన్నారు. **గూడూరు:** స్థానిక రాజావీధిలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద భక్తుల సహకారంతో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా వేడుకలు జరిగాయి. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడుకి ప్రత్యేక పూజలు చేశారు. తప్పెట్లు, తాళాలతో గ్రామోత్సవం జరిపారు. కృష్ణుడు, పాండవ, కౌరవుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న కృష్ణుడి బొమ్మల కొలువు ఆకట్టుకుంది. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయి సత్సంగ్ నిలయంలో కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. త్యాగరాజ వీధిలోని గీతామందిరంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. **పెళ్లకూరు:**అక్కగారిపేట, కప్పగుంటకండ్రిగ, చెన్నప్పనాయుడు పేట, చెంబేడు, జీలపాటూరు తదితర గ్రామాల్లో ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. **డక్కిలి** : చాపలపల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడిని ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు వెంకటరత్నమ్మ పర్యవేక్షణలో శ్రీకృష్ణుడి ప్రతిమను పూలతో అలంకరించి ఊరేగించారు. డక్కిలి, వెంబులూరు, మోపూరు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. **వెంకటగిరి** : మదరకాడమి పాఠశాలలో కృష్ణుని వేషధారణలో విద్యార్థుల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టు కొంది. స్థానిక పాలకేంద్రం సెంటరు వద్ద ఆలయంలో భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. **వెంకటగిరిటౌన్:** రాపూరు క్రాస్ రోడ్డు వద్ద కృష్ణమందిరం, బంగారుపేటలోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. **తడ:** చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో. గోపూజ నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పాల్గొని ఉట్టి కొట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమాలలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు పార్థసారథి, మురళీరెడ్డి, పురుషోత్తం, తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, అన్నదాన కమిటీ చైర్మన్ దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.



గూడూరులో భక్తులకు అన్నదానం

ఆగని ఇసుక దందా

● పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు
● రాత్రుల్లో యథేచ్ఛగా రవాణా



కప్పగుంటకండ్రిగ వద్ద పొర్లకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్న అక్రమార్కులు

పెళ్లకూరు, ఆగస్టు 26 : మండలంలో ఇసుకదందా ఆగడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి ఇసుక, గ్రావెల్ దోపిడీ యథేచ్ఛగా సాగింది. అధికారులు సైతం ఇందుకు సహకరించారు. ఎన్డీయే కూటమి ఏర్పడ్డాక సమగ్ర విధానం అమలు చేసేందుకు నడుం బిగించినా ఇసుకాసురులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా కప్పగుంటకండ్రిగ సమీపంలోని రాజగారితోట స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నివ్వెరపరుస్తున్నాయి. పొర్లకట్టను తవ్వి వాహన రాకపోకలకు వీలుగా దారి సైతం ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణముఖినదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుండం కొందరు రాజకీయ నేతలకు అక్రమార్జన వనరుగా మారింది. ప్రభుత్వం ఏదైనా అధికారుల అండదడండలు ఉంటే ఇసుక దోపిడీ సాగించవచ్చునని అక్రమార్కులు భావిస్తున్నారు. యడపూడి, పిడికిటమాల, కప్పగుంటకండ్రిగ, జీలపాటూరు తదితర గ్రామాల రైతులకు పొలాలకు, ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ తవ్వకాలు జరిపితే బోర్లలో నీరు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవు. అయినా ఇసుక తవ్వకాలకు పాల్పడుతుండటంతో ఇక్కడి ప్రజలు కలవరపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తవ్వకాలను నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇస్రో ప్రాజెక్టులపై అవగాహనకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట, ఆగస్టు 26: ప్రయోగ పరికరాలు, ఉపగ్రహాలకు సంబంధించిన ప్రాజెక్టులపై సంస్థలో పలు విభాగాల మిడిల్ లెవల్ మేనేజర్లకు అవగాహన కల్పించాలని శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్ సంకల్పించింది. ఇందులో భాగంగా వారం రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమానికి యూఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ ఎస్.శంకరన్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. షార్ డైరెక్టర్ జ్యోతి ప్రజ్వళన చేశారు. షార్ డైరెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ విషయాలపై ఇంజినీర్లు, సీనియర్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమన్నారు. రాకెట్ ప్రయోగాకు సంబంధించి ఇస్రో ప్రాజెక్టుల్లో అందరి భాగస్వామ్యంతో సమర్థవంతంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు. అసోసియేట్ డైరెక్టర్ సయ్యత్ అహమ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళులు



వాకాడు, ఆగస్టు 26 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జాతి వైషమ్యాలు లేకుండా దీనులకు అండగా నిలిచిన మాతృమూర్తి మదర్ థెరిసా అన్నారు. నిస్సహాయులకు మదర్ థెరిసానిరంతరం సహాయం అందించి విశ్వమాతగా నిలిచారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం అభినందనీయం: విజయశ్రీ



వృద్ధురాలికి వస్త్రాలను అందజేస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 26 : వృద్ధాశ్రమాల ద్వారా సేవలందించగం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సంజాయ్‌గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకులు సునీతాబెన్నిలను అభినందించారు. వృద్ధులకు దుస్తులను, పండ్లు, రొట్టెలు అందజేశారు. తమ కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వాహకులకు రూ.5వేల నగదు అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు మైలారి రాజశేఖర్, గాదిరెడ్డి గోపీ, ఎగుదల విజయకుమార్, పార్థసారధి, టికె శ్రీనివాసులు, సెల్వం, బాబు, చెంగయ్య, చక్రపాణి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో తాగునీటి కోసం నిత్యం తిప్పలే..

లీకేజిలకు మరమ్మతులు చేసి సరఫరా చేస్తాం: కమిషనర్



నీటి కోసం రోడ్డుపై ఇటీవల ధర్నా చేస్తున్న మహిళలు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 26: తాగునీటి కోసం పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 25వార్డుల్లోనూ నాలుగు నెలలుగా మున్సిపాలిటీ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. ప్రతి ఇంటికీ మున్సిపల్ కుళాయి ఉన్నా నామమాత్రమైందని మహిళలు వాపోతున్నారు. ఉదయం 6.30 గంటలకు మున్సిపల్ నీరు వదులుతారు. తరువాత 15 నిమిషాలకే ఆపేస్తున్నారు. గతంలో 6.30 నుంచి 7.30వరకు వచ్చేవి. తాగునీరు ఉదయం 10నుంచి 11గంటల వరకు వదిలేవారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు శివారు ప్రాంతాలకు వెళ్లేందుకేనని అధికారులు చెబుతున్నారు. కానీ వాటర్ ట్యాంకర్లను పక్కదారి పట్టించి అధికారులు లబ్ధి పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలంకార ప్రాయంగా వాటర్ ట్యాంకులు

మున్సిపాలిటీలో ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు నాలుగున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి శుద్ధి చేసిన జలాలను ట్యాంకులకు పంపిస్తారు. అయితే నీటిని వదిలే సిబ్బంది మొక్కుబడిగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులు ముందు మున్సిపల్ కమిషనర్‌కు తొలిమిట్టలో నీరు రావడం లేదని ఫిర్యాదు చేశారు. కమిషనర్ పరిశీలించి రెండు రోజుల్లో పైపులైన్ లీకేజిలకు మరమ్మతులు చేయించి నీటిని వదులుతామన్నారు. వారమైనా నీరు రాకపోవడంతో మహిళలు రోడ్డుపై భైఠాయించారు. గతంలో మున్సిపాలిటీ నీరు రానపుడు తొలిమిట్టలో బోరులో తాగునీరు పట్టుకుని వాడుకునేవారు. ఓ ఆకతాయి వల్ల బోరు కూడా పనిచేయడంలేదు. ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు నిరాశ చెందుతున్నారు. పైపులైన్ లీకేజీలు సరిచేసి నీరు సరఫరా చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ రషీద్ చెప్పారు. బోర్లు రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

సిద్ధమవుతున్న గణనాథుడి విగ్రహాలు

● విభిన్న రూపాల్లో ఆకట్టుకుంటున్న ప్రతిమలు
● ఆర్డర్లకు ఉత్సాహం చూపుతున్న భక్తులు

సూళ్లూరుపేట, ఆగస్టు 26: గణనాథుడి విగ్రహాలు వివిధ రూపాల్లో రూపుదిద్దుకుంటున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పట్టణంలో జాతీయ రహదారి పక్కన మూడు చోట్ల వీటిని తయారుచేస్తున్నారు. భక్తులకు ఆర్డర్ల మేరకు అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. విభిన్న రూపాల్లో రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వినాయక చవితి ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండటంతో తయారీలో వేగం పెంచారు. తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల్లో తయారైన విగ్రహాలను ఇక్కడకు తీసుకొచ్చి రంగులు అద్దుతున్నారు. మరో పక్క గతేడాది కంటే ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల మండపాలు ఏర్పాటులో బిజీగా ఉన్నారు. ఆకర్షణీయ విగ్రహాల ఏర్పాటుకు ఉత్సాహపడుతున్నాయి. ఈమేరకు ఆర్డర్లు ఇస్తున్నాయి. డిమాండుకు దీటుగా కళాకారులు కూడా విగ్రహాల రూపకల్పనలో తలమునకలై ఉన్నారు. హోలిక్రాస్ సమీపంలో, కోటపోలూరు క్రాస్ రోడ్డు, ఎంకేఎం కల్యాణ మండపం వద్ద స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. 4 నుంచి 20 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈసారి ధర కూడా పెరిగింది. రూ.5 వేల నుంచి రూ.35 వేల వరకూ పలుకుతున్నాయి. నెమలి, హంస, నంది, మూషికం, సింహం, గజరథం, శివుడు, శ్రీకృష్ణుడు, అయోధ్య బాలరాముడు ఆకృతుల్లోని విగ్రహాల తయారీకి ఆర్డర్లు వస్తున్నాయని కళాకారులు చెబుతున్నారు.





చవితి వేడుకలకు ముస్తాబైన గణనాథుని విగ్రహాలు-విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారుడు